నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది
గీతాజయంతి సందర్భంగా - పద్యం

చేతిలోన దివ్వె చీకటి పోగొట్టి
దారిచూపుమనకు ధరణియందు
చేతబట్టు నీవు గీత పుస్తకమును
చింతలన్నిపోవు చిత్రముగను

విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు

**విలేకరులు కావలెను**
తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 227 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 1-12-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00

# నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

- సభ సజావుగా సాగేందుకు సహకరించాలి : అఖిలపక్షంతో కేంద్రం
- ఓపికగా విన్నారు... కానీ ఏమీ చెప్పలేదు : గౌరవ్‌గోగోయ్
- వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయనున్న ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ – నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభంకానున్నాయి. డిసెంబర్ 1 నుంచి 19 వరకు ఈ సమావేశాలు జరుగనున్నాయి. ఢిల్లీలో బాంబు పేలుడు, బీహార్ ఎన్నికల ఫలితాల తరువాత మొదటిసారిగా ఉభయసభలు సమావేశం కానున్నాయి. అలాగే రాజ్యసభ సభ చైర్మెన్‌గా తొలిసారి సీపీ రాధాకృష్ణన్ సభాధ్యక్షత వహించనున్నారు. కాగా మొత్తం 15 రోజులపాటు జరిగే ఈ సమావేశాలు వాడీవేడిగా కొనసాగే అవకాశాలున్నాయి. పార్లమెంట్ ఉభయ

-మిగతా 2 లో

# సర్' గడువు వారం పొడిగింపు

- ఫిబ్రవరి 14న తుది జాబితా
- ఈసీ ఉత్తర్వులు జారీ

న్యూఢిల్లీ – నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
వివాదాస్పద ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ విషయంలో ఈసీ మరో నిర్ణయం తీసుకున్నది. దేశంలోని 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల (యూటీలు)లో జరుపుతోన్న సర్ గడువును వారం రోజులకు పొడిగిం చింది. ఈ మేరకు ఆదివారం ఉత్త ర్వులు జారీ చేసింది. దీంతో ఓటర్ల లెక్కింపు డిసెంబర్ 4కు బదులు డిసెంబర్ 11న ముగియనున్నది. 'సర్' గడువు పొడిగింపు నేపథ్యంలో ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత



-మిగతా 2 లో



# ఉగాదికి మరో 5 లక్షల ఇళ్లు

- ప్రజల్లోకి ప్రభుత్వ కార్యక్రమాలు
- టిడిపి నేతలతో సిఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- అనర్హులకు పెన్షన్లు అందుతున్నాయని వ్యాఖ్య

అమరావతి నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ పార్టీ నేతలకు సూచించారు. యూనిట్ వ్యవస్థ పార్టీకి బలంగా ఉందని తెలిపారు. టిడిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ముఖ్యనేతలు, బూత్‌స్థాయి కార్యకర్తలతో ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పొలిటికల్ గవర్నెన్స్ అనేది ప్రభుత్వ విధానమన్నారు. ప్రతినెలా

-మిగతా 2 లో



# మా దార్శనికతే మా ప్రణాళిక

**ఆదాయాన్ని పెంచుతాం పేదలకు పంచుతాం**

- పారదర్శక విధానాలను జాతికి అంకితం చేస్తాం
- మెరుగైన భవిష్యత్ కోసం రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించాం
- కోర్..ప్యూర్.. రేర్‌లుగా తెలంగాణ
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- ఇందుకోసం అన్ని రంగాల్లో ప్రత్యేక విధానాలు
- అందరి భాగస్వామ్యంతో విజన్ డాక్యుమెంట్ : మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి
- 'తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమ్మిట్'పై ఉన్నతస్థాయి సమీక్ష
- మంత్రులతో కలిసి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

హైదరాబాద్ నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
'మా దార్శనికతే మా ప్రణాళిక.. మా పాలసీల ద్వారా ఆదాయాన్ని పెంచుతాం, పేదలకు పంచుతాం ' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా పలు రంగాలపై రూపొందించిన పారదర్శక విధానాలను ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా జాతికి అంకితం చేయబోతున్నామని ఆయన తెలిపారు. మెరుగైన భవిష్యత్ కోసం రాష్ట్రాన్ని కోర్, ప్యూర్, రేర్ అనే మూడు భాగాలుగా విభజించామని వెల్లడించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్‌ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా అన్ని రంగాలకు ప్రత్యేక

-మిగతా 2 లో



# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

- అన్నాచెల్లెలు సహా నలుగురి సజీవదహనం
- ఒక మహిళ సహా ఇద్దరికి గాయాలు
- ఘటనపై కేసు నమోదు..
- దర్యాప్తు ప్రారంభం : పోలీసులు

ఢిల్లీ నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాద ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నగరంలోని టిగ్రి ఎక్స్ టెన్షన్లోని చెప్పుల దుకాణంలో జరిగిన ఈ ఘటనలో అన్నా, చెల్లెలు సహా నలుగురు సజీవదహనమయ్యారు. ఒక మహిళ సహా ఇద్దరు గాయపడ్డారు. ఢిల్లీ పోలీసులు ఈ విషయాన్ని తెలిపారు. వివరాల్లోకెళ్తే నాలుగు అంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న చెప్పుల దుకాణంలో మంటలు చెలరేగినట్టు సాయంత్రం 6.24 గంటలకు పీసీఆర్ కాల్ వచ్చింది. దీంతో వెంటనే తమతో పాటు అగ్నిమాపక సిబ్బందిని తీసుకుని పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ సహాయక చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే భవనం మొత్తం మంటలు వ్యాపించాయి.దీంతో మంటలను అదుపుచేసేందుకు సుమారు 5 గంటల సమయం పట్టింది. ప్రమాదంలో మరణించినవారిలో భవన యజమాని జిమ్మీ, ఆయన సోదరి అనితగా గుర్తించామని అధికారులు చెప్పారు. మరో ఇద్దరు మృతులను గుర్తించాల్సి ఉందన్నారు. ఇక గాయపడినవారిలో ఒకరిని మమత

-మిగతా 2 లో

# హిల్ట్‌పై మాట్లాడరేం?..

- రాహుల్‌గాంధీకి కేటీఆర్ లేఖ
- దేశంలో అతిపెద్ద కుంభకోణంపై స్పందించడం లేదెందుకు?
- 5 లక్షల కోట్ల అవినీతిలో మీకూ భాగస్వామ్యం ఉన్నట్టేనా?
- కాంగ్రెస్ అనుయాయులకు కారుచౌకగా ప్రభుత్వ భూమి
- వేల కోట్ల ఆస్తుల మార్పిడికి 45 రోజుల్లోనే అనుమతులా?
- తెలంగాణ ఆస్తిని కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిస్తే ఊరుకోం



హైదరాబాద్,నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు హిల్ట్ పాలసీ పేరిట రూ. 5 లక్షల కోట్ల కుంభకోణానికి పాల్పడుతుంటే ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ మౌనమెందుకు వహిస్తున్నారు? స్పందించకపోవడంలోని ఆంతర్యమేమిటి? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మౌనం ఆమోదానికి సంకేతమా అని నిలదీశారు.

-మిగతా 2 లో

# ఈ నెల 2 లోపు నివేదిక సమర్పించాలి

విజన్ డాక్యుమెంట్ పై అధికారులకు సీఎం ఆదేశం




# సిమ్ లేకుండా వాట్సాప్, టెలిగ్రామ్ పని చేయవు!

- కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు..
- 90 రోజుల్లో అమలులోకి



న్యూఢిల్లీ, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఇకపై సిమ్ ఉంటేనే వాట్సాప్, టెలిగ్రామ్‌లు పనిచేస్తాయి. మెసేజింగ్ యాప్‌లైన వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్, స్నాప్‌చాట్, షేర్ చాట్, జియోచాట్, అరైట్టై, జోష్‌లకు కేంద్ర ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. సిమ్ యాక్టివేట్ అయి ఉన్న మొబైల్స్‌లో మాత్రమే ఈ యాప్‌లు పనిచేయాలని స్పష్టం చేసింది. ఈ నిబంధన 90 రోజుల్లో అమల్లోకి వస్తుందని తెలిపింది. పనిచేయని నెంబర్లు, మోసాలు, స్పామ్‌లను తగ్గించడానికి, యూజర్ గుర్తింపు (కేవైసీ) పారదర్శకతను పెంచడానికి ఈ చర్యను తీసుకున్నట్టు ప్రకటించింది.వినియోగదారుడి మొబైల్‌లోని రిజిస్టర్డ్ సిమ్ క్రియాశీలకంగా ఉన్నప్పుడు మాత్రమే ఈ యాప్‌లు పనిచేస్తాయని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ వెల్లడించింది. ఒక వేళ సిమ్‌ను తొలగించినా, పనిచేయకపోయినా యాప్‌లు కూడా ఆటోమెటిక్‌గా పనిచేయడం మానేస్తాయి.

-మిగతా 2 లో

# తొలిదశ సర్పంచ్ నామినేషన్లు 25,654


**అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో 1,387**

- అత్యల్పంగా ములుగులో 220
- వార్డు స్థానాలకు 82,276 నామినేషన్లు
- డిసెంబర్ 3న అభ్యర్థుల తుది జాబితా




హైదరాబాద్ నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
రాష్ట్రంలో తొలి దశ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. చివరి రోజు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రంలో 189 మండలాల్లోని 4,236 పంచాయతీలు, 37,440 వార్డులకు తొలిదశలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్ల వివరాలను ఎన్నికల సంఘం అధికారులు ఆదివారం వెల్లడించారు. మొదటి విడత సర్పంచ్ పదవికి 25,654 నామినేషన్లు, వార్డు స్థానాలకు 82,276 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్ పదవికి అత్యధికంగా సూర్యాపేట జిల్లాల్లో 1,387 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ జిల్లాలో రెండు

-మిగతా 2 లో



# భారతీయ నిపుణులతో అమెరికాకు గొప్ప లాభం

- హెచ్-1బీ వీసా వివాదంపై ఎలాన్ మస్క్ వ్యాఖ్య

వాషింగ్టన్ -నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
అనేక సంవత్సరాలుగా భారతీయ ప్రతిభావంతులను నియమించుకుంటూ అమెరికా అత్యధిక లబ్ధిని పొందిందని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అన్నారు. జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహించిన 'పాడ్‌కాస్ట్‌లో ఆదివారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ గతంలో దుర్వినియోగమైనందువల్ల, గత ప్రభుత్వాలు అత్యంత ఉదాసీనంగా వ్యవహరించినందువల్ల అమెరికాలో వలసలకు వ్యతిరేక భావాలు ఉత్పన్నమయ్యాయని తెలిపారు. జో బైడెన్ అడ్మినిస్ట్రేషన్‌లో సరిహద్దుల్లో ఎటువంటి నియంత్రణ ఉండేది కాదని, అందరూ స్వేచ్ఛగా అమెరికాకు వచ్చేవారని చెప్పారు. సరిహద్దుల్లో నియంత్రణ లేకపోతే, అది దేశమే కాదన్నారు. బైడెన్ అడ్మినిస్ట్రేషన్ సమయంలో అక్రమ వలసదారులు పెద్ద ఎత్తున అమెరికాకు వచ్చారన్నారు.ఇది కొంత వరకు నెగెటివ్ సెలక్షన్ ఎఫెక్ట్ అని తెలిపారు. ఇతర దేశాల నుంచి వచ్చే ప్రతిభావంతులు అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొడుతున్నారనే భావనలో వాస్తవమెంతో కచ్చితంగా చెప్పలేనన్నారు. ప్రతిభావంతుల కొరత ఉందనేది తన

-మిగతా 2 లో

# దిత్వా ఎఫెక్ట్.. పలు జిల్లాల్లో నేడు వర్షాలు

- 24గంటల్లో బంగాళాఖాతంలో వాయుగుండం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



హైదరాబాద్ నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాను రాబోయే 24గంటల్లో బలహీనపడి వాయుగుండంగా మారునున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. తుఫాను బలహీనపడినా దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు, తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు

-మిగతా 2 లో

# నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

మొదటి తరువాయి

సభల్లో కొత్తగా మొత్తం 10 బిల్లులతో సహా నాలుగు ఆర్థిక సవరణ బిల్లులు, కాలం చెల్లిన మొత్తం 120 చట్టాలను రద్దు చేసే బిల్లు, హౌం, అణుశక్తి, విద్య, రహదారులకు చెందిన మరో ఐదు కీలక బిల్లులను ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది.

అణుశక్తిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చట్టం చేసేందుకు బిల్లును సభ ముందుకు తీసుకురానుంది. అలాగే దేశంలో నేషనల్ హైవేలు (జాతీయ రహదారులు) వేగవంతంగా పూర్తయ్యేలా పారదర్శకతో కూడిన భూసేకరణ కోసం కీలకమైన చట్ట సవరణ బిల్లుపై ఆలోచన చేస్తోంది. శాస్త్ర, సాంకేతిక విద్యాసంస్థలు, పరిశోధన రంగం, ఉన్నత విద్యలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పే లక్ష్యంగా, సమన్వయంతో పనిచేసేందుకు భారత ఉన్నత విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసే దిశలో కీలక బిల్లును తీసుకురానుంది. వీటితో పాటు గత పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టి పార్లమెంట్ సెలెక్ట్ కమిటీల పరిశీలనకు పంపిన మరో రెండు బిల్లులను కూడా ఈ సమావేశాల్లో ఆమోదించనున్నట్టు తెలిసింది.

**సభ సజావుగా సాగేందుకు సహకరించండి**

సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదివారం పార్లమెంట్ హౌస్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి కేంద్ర ప్రభుత్వం తరపున సీనియర్ మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్ పాల్గొన్నారు. ప్రతిపక్షం తరపున కాంగ్రెస్ నేతలు జైరామ్ రమేష్, గౌరవ్ గొగోరు, ప్రమోద్ తివారీ, ఎస్పీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్, ఆర్‌జేడీకి చెందిన మనోజ్ ఝా, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ, టీఆర్ బాలు, టీఎంసీకి చెందిన డెరెక్ ఓ'బ్రియన్, కళ్యాణ్ బెనర్జీ, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్, ఎన్‌సీపీ ఎంపీ ఫౌజియా ఖాన్, ఐయుఎంఎల్ ఎంపీ ఈటి మొహమ్మద్ బషీర్, టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జనసేన ఎంపీ బాల శౌరి, వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ కెఆర్ సురేశ్ రెడ్డి, కమల్‌హాసన్‌తో పాటు మొత్తం 36 పార్టీల నుంచి 50 మంది నేతలు పాల్గొన్నారు. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ భేటీలో పార్లమెంట్ ఉభయ సభలు సజావుగా సాగేందుకు సహకరించాలని ప్రతిపక్షాలను కేంద్ర ప్రభుత్వం కోరింది.

**సర్‌పై చర్చకు ప్రతిపక్షం పట్టు**

ఈ సమావేశంలో ప్రతిపక్షాలు మాత్రం దేశంలోని తాజా పరిస్థితులు, సమస్యలను లేవనెత్తాయి. 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరుగుతోన్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్( సర్)పై చర్చకు పట్టుబట్టాయి. అలాగే జాతీయ భద్రతకు సంబంధించి ఢిల్లీలోని ఎర్ర కోట వద్ద జరిగిన బాంబు పేలుడు ఘటనపై చర్చించాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని, పార్లమెంటరీ సంప్రదాయాలను సమాధి చేయాలని చూస్తోందని ఈ సందర్భంగా ప్రతిపక్షాలు విమర్శించాయి. అలాగే%ఔ% పలు పార్టీలు ఆయా రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై సమావేశంలో లేవనెత్తాయి. అయితే%ఔ% రాజకీయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉంటాయని సమావేశం అనంతరం కిరణ్ రిజిజు అన్నారు. "ప్రతిపక్షాలు చర్చల్లో పాల్గొనాలి. సభను ఆటంకపరచవద్దు. ప్రతిపక్షాలు అనేక అంశాలు లేవనెత్తాయి. అందులో సర్ ఒకటి. వందేమాతరం 150 ఏండ్ల సందర్భంగా పార్లమెంట్‌లో చర్చపై బీఏసీలో నిర్ణయం తీసుకుంటాం. అఖిల పక్ష సమావేశంలో తమ అభిప్రాయాలు వెల్లడించిన ప్రతిపక్షాలకు ధన్యవాదాలు" ఆయ అని అన్నారు.

# మా దార్శనికతే మా ప్రణాళిక

మొదటి తరువాయి

విధానాలను, విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని చెప్పారు. వాటి రూపకల్పనలో అందరినీ భాగస్వాములను చేశామని వివరించారు. 'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ -2047'పై ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్య మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)కి చెందిన ప్రొఫెసర్లు విజన్ డాక్యుమెంట్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రులతో కలిసి సీఎం గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ%ఔ% గ్లోబల్ సమ్మిట్‌ను ఘనంగా నిర్వహించటం ద్వారా బడా పెట్టుబడులను ఆకర్షిస్తామని, తద్వారా రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసానిచ్చారు. 2034 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. ఇందుకోసం రూపొందించిన ప్రత్యేక పాలసీలను చూసిన వారెవరైనా.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టకపోతే ఏదో కోల్పోయామని భావించే విధంగా పరిస్థితిని కల్పిస్తామని వ్యాఖ్యానించారు. అభివృద్ధిలో పొరుగు రాష్ట్రాలతో కాదు..చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్‌లతో పోటీ పడతామని చెప్పారు. గతానుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలను భవిష్యత్ ప్రణాళికగా మార్చుకుని రాష్ట్ర ప్రజలకు అద్భుతమైన భవిష్యత్తును అందిస్తామని సీఎం తెలిపారు. సంక్షేమ పథకాలను మరింత మెరుగ్గా అందిస్తామని అన్నారు. తెలంగాణ రైజింగ్ -2047-విజన్ డాక్యుమెంట్ రూపకల్పన కోసం వివిధ రంగాలకు చెందిన నిపుణులు, వివిధ శాఖల అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో పాటు నిటి అయోగ్, ఐఎస్‌బీ సహకారం తీసుకున్నామని చెప్పారు. పాలసీలంటే పారదర్శకంగా ఉండాలిగానీ వాటికి పెరాలసిస్ (పక్షవాతం) రాకూడదు, అలా వస్తే రాష్ట్రానికి నష్టదాయకమని హెచ్చరించారు. పాలసీ పెరాసిస్ వల్ల పెట్టుబడులకు రక్షణ కొరవడి, అభివృద్ధికి విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ, బెంగళూరు, ముంబై తదితర మెట్రో నగరాలు కాలుష్యం, శాంతిభద్రతల వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయని సీఎం గుర్తు చేశారు. భవిష్యత్తులో హైదరాబాద్‌కు, తెలంగాణకు అలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకు విజన్ డాక్యుమెంట్‌లో పలు అంశాలు పొందుపరిచినట్టు ఆయన వివరించారు. తెలంగాణ భవిష్యత్‌ను మరింత మెరుగుపరచటం కోసం రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకామని (క్యూర్)గాను, ఓఆర్ఆర్ నుంచి త్రిబుల్ ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని ఫెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్)గాను, త్రిబుల్‌ఆర్ అవతల నుంచి తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ అగ్రి రీజియన్ ఎకామని (రేర్)గానూ విడగొట్టి, వాటికి అవసరమైన ప్రణాళికలను రూపొందినట్టు తెలిపారు. క్యూర్ ప్రాంతాన్ని పూర్తిగా సర్వీస్ సెక్టార్‌గా మార్చి సంపూర్ణ కాలుష్యరహితంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. ఇందుకనుగుణంగా పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలికి తరలిస్తున్నట్టు చెప్పారు. వరదల సమస్యను తగ్గించేందుకు ఈ ప్రాంతాన్ని ఒక యూనిట్ తీసుకుంటామని, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, మెట్రో విస్తరణ తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నామని వివరించారు. ఇప్పటికే కేంద్రం త్రిబుల్‌ఆర్‌తోపాటు, బుల్లెట్ ట్రైన్లకు సూత్రప్రాయంగా అంగీకరించిందని సీఎం చెప్పారు. ఒక ప్రాంత అభివృద్ధికి రవాణా కీలకమని, అందుకే రాష్ట్రంలో హైవే, పోర్ట్, ఎయిర్ కనెక్టివిటీని పెంచబోతున్నట్టు తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం, రామగుండంలలో నూతనంగా విమానాశ్రయాలు నిర్మించబోతున్నట్టు చెప్పారు. దీంతో ఇతర దేశాల నుంచి మన రాష్ట్రానికి దిగుమతులతోపాటు మన ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు వీలు కలుగుతుందని అన్నారు. ప్యూర్ పరిధి 360 కిలోమీటర్లు కాగా ఇక్కడ మెట్రోతోపాటు ఫార్మా తదితర కంపెనీల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు.

## సిమ్ లేకుండా వాట్సాప్, టెలిగ్రామ్ పని చేయవు!

మొదటి తరువాయి

ఇక వెబ్ బ్రౌజర్ల ద్వారా లాగిన్ అయితే ఆయా మెసేజింగ్ వేదికల నుంచి ప్రతి ఆరు గంటలకోసారి లాగౌట్ అవుతుంది. తర్వాత క్యూఆర్ కోడ్ ధ్రువీకరణ ద్వారా మొబైల్ సిమ్‌తో తిరిగి లాగిన్ అవ్వాలి. ప్రస్తుతం సిమ్ లేకపోయినా, అది పనిచేయకపోయినా ఈ మెసేజింగ్ యాప్‌లను వాడుతున్నారు.

## దిత్వా ఎఫెక్ట్.. పలు జిల్లాల్లో నేడు వర్షాలు

మొదటి తరువాయి

కురవనున్నట్టు తెలిపింది. ఈ తుఫాను ప్రస్తుతం పుదుచ్చేరి తమిళనాడు తీరాల నుంచి సుమారు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్నదని తెలిపింది. రాగల 24గంటల్లో ఈ దిత్వా తుఫాను ఉత్తర తమిళనాడు తీరానికి సమాంతరంగా కదిలే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఆదివారం రాత్రికి ఈ తుఫాను నైరుతి బంగాళాఖాతంలో ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరప్రాంతాల సమీపంలో 30నుంచి 60కి.మీ వేగంతో చేరుకునే అవకాశం ఉన్నదని తెలిపింది.ఈ నేపథ్యంలో ఇప్పటికే తమిళనాడు, పుదుచ్చేరి, కోస్తా ఆంధ్ర, రాయలసీమకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్టు పేర్కొన్నది. సోమవారం తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. అలాగే రెండురోజుల పాటు కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఇదిలా ఉండగా, దిత్వా తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో గత రెండురోజుల నుంచి చలి తీవ్రత మళ్లీ పెరిగింది. దీంతో పలు జిల్లాల్లో రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ) మండలంలో అత్యల్పంగా కనిష్ఠ ఉష్ణోగ్రత 9.7 డిగ్రీలుగా నమోదైంది.

## భారతీయ నిపుణులతో అమెరికాకు గొప్ప లాభం

మొదటి తరువాయి

ప్రత్యక్ష పరిశీలన అని చెప్పారు. సంక్లిష్టమైన పనులను చేయడానికి ప్రతిభావంతులను నియమించుకోవలసి ఉంటుందని తెలిపారు. స్పేస్ ఎక్స్, టెస్లా, ఎక్స్ వంటి టాప్ యూఎస్ కంపెనీల చీఫ్‌గా తాను ప్రతిభావంతుల కోసమే చూస్తానని, వారికి సగటు కన్నా ఎక్కువ వేతనాలు చెల్లిస్తానని చెప్పారు. హెచ్-1బీ ప్రోగ్రామ్‌ను కొనసాగిస్తూ, దాని దుర్వినియోగాన్ని అరికట్టాలని తెలిపారు. అమెరికాలో పని చేయాలనే ఆకాంక్ష గల భారతీయులకు ఇచ్చిన సందేశంలో, "తీసుకున్నదాని కన్నా ఎక్కువ పని చేసే వారిని నేను గౌరవిస్తాను. తీసుకునే దాని కన్నా సమాజానికి ఎక్కువ ఇచ్చే వారిగా ఉండండి. ఇన్‌పుట్ కన్నా ఔట్‌పుట్ ఎక్కువ విలువైనదిగా ఉండటంపై దృష్టి పెట్టండి" అని చెప్పారు.

## తొలిదశ సర్పంచ్ నామినేషన్లు 25,654

మొదటి తరువాయి

రోజుల్లో 366 నామినేషన్లు దాఖలు కాగా, చివరి రోజు 1021 నామినేషన్లు దాఖలైనట్టు అధికారులు తెలిపారు. ఆ తర్వాత అత్యధిక నామినేషన్లు దాఖలైన రెండో జిల్లాగా వికారాబాద్ నిలిచింది. ఈ జిల్లాల్లో 262 గ్రామ పంచాయతీలకు 1,383 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆ తర్వాత మహబూబాబాద్ లో 155 జీపీలకు గాను 1239, ఆ తర్వాత కామారెడ్డి జిల్లాలో 167 జీపీలకు గాను 1,224 నామినేషన్లు, ఆ తర్వాత రంగారెడ్డి జిల్లాలో 174 జీపీలకు గాను 1.169 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యల్పంగా ములుగు జిల్లాలో 48 జీపీలకు గాను 220 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డుల వారీగా తొలిదశలో మొత్తం 37,440 వార్డులకు 82,276 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధిక రంగారెడ్డి జిల్లాలో 1,530 వార్డులకు గాను 4,540 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆ తర్వాత వికారాబాద్‌లో 2,198 వార్డులకు గాను 4,379, ఖమ్మంలో1,740 వార్డులకు గాను 4,041, కామారెడ్డిలో 152 వార్డులకు గాను 3,832, సూర్యాపేటలో 1,442 వార్డులకు గాను 3,791 నామినేషన్లు దాఖల య్యాయి. అత్యల్పంగా ములుగులో 420 వార్డు స్థానాలకు గాను 967 నామినేషన్లు దాఖలైనట్టు అధికారులు వెల్లడించారు. సర్పంచ్, వార్డు మెంబర్లకు దాఖలైన నామినేషన్ల పరిశీలన ఆదివారం రాత్రి వరకు కొనసా గుతూనే ఉంది. పరిశీలన పూర్తయిన తర్వాత ఎన్నికల సంఘం అధికారులు సక్రమంగా ఉన్న నామినేషన్ల వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

## ఈ నెల 2 లోపు నివేదిక సమర్పించాలి

విజన్ డాక్యుమెంట్ పై అధికారులకు సీఎం ఆదేశం



హైదరాబాద్

తెలంగాణ రైజింగ్- 2047 పాలసీ డాక్యుమెంట్‌కు సంబంధించిన నివేదికను ఈ నెల 2వ తేదీ రాత్రి వరకు సమర్పించాలని అన్ని శాఖల ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం సచివాలయంలో ఆయన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను మంత్రులు, సంబంధిత విభాగాల అధికారులు తమ శాఖ పరిధిలోని ప్రతి అంశాన్ని చర్చించి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు.

## సర్' గడువు వారం పొడిగింపు

మొదటి తరువాయి

ప్రాంతాల్లో డిసెంబర్ 9న విడుదల చేయాల్సిన ముసాయిదా ఓటర్ల జాబితాను డిసెంబర్ 16న విడుదల చేస్తారు. ఫిబ్రవరి 14న తుది జాబితా ప్రచురించనున్నట్టు ఈసీ పేర్కొన్నది. బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా చేపట్టిన సర్ రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన విషయం విదితమే. ఇప్పుడు దేశవ్యాప్తంగా మరో 12 రాష్ట్రాలు, యూటీలలో సర్‌ను నిర్వహిస్తుం డటం తీవ్ర విమర్శలు, వ్యతిరేకతకు దారి తీసింది. పలు రాష్ట్రాల్లో ప్రధానంగా పశ్చిమ బెంగాల్‌లో 'సర్' విధుల్లో ఉన్న ఎన్నికల అధికారులు, బూత్ లెవల్ ఆఫీసర్స్(బీఎల్‌ఓలు) తీవ్ర పని ఒత్తిడి, వేధింపుల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గుజరాత్ వంటి రాష్ట్రాల్లో బీఎల్‌ఓలు నిరసనలూ చేశారు. తమ బాధలు, అసంతృప్తిని వెళ్లగక్కారు. సర్ ప్రక్రియ ఇటు ఓటర్లకూ తీవ్ర ఇబ్బందికరంగానే మారింది. 2002 నాటి సమాచారాన్ని పొందటం వారికి కష్టంగా మారింది. అటు బీఎల్‌ఓలు, ఇటు ప్రజలూ సర్ కారణంగా ఆందోళనకు, గందరగోళానికి గురవుతున్నారు. సీఈసీని కలిసిన టీఎంసీ నేతలు తక్కువ సమయం ఇచ్చి డెడ్‌లైన్ లోపు 'సర్' ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలపై ఒత్తిడి చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఈసీపై ఇప్పటికే ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి.'సర్' ప్రక్రియను వాయిదా వేయాలని డిమాండ్ చేశాయి. పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ), ఇతర ప్రతిపక్ష పార్టీలు సర్ వ్యతిరేక రాగాన్ని బలంగానే వినిపిస్తున్నాయి. ఈ మేరకు ఆయా పార్టీల నేతలు ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కలిశారు. సర్ ప్రక్రియను రీషెడ్యూల్ చేయాలని ఈసీని కోరారు. సోమవారం నుంచి ప్రారంభంకానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఉభయ సభలను 'సర్' అంశం కుదిపేయనున్నది. ఈ విషయాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామని కాంగ్రెస్ సహా పలు పార్టీల నాయకులు ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో 'సర్' గడువును ఈసీ మరో వారం ఈసీ పొడిగించటం గమనార్హం.

## ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

మొదటి తరువాయి

(40)గా గుర్తించారు. 25 శాతం కాలిన గాయాలతో ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు ఆధారాలు సేకరిస్తున్నామని పోలీసు అధికారులు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

## ఉగాదికి మరో 5 లక్షల ఇళ్లు

మొదటి తరువాయి

ఒకటో తేదీన ఎలాంటి ఆటంకమూ లేకుండా పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల అనర్హులకు పింఛన్లు అందుతున్నాయని అన్నారు. అర్హులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగదని తెలిపారు.

పింఛన్ల కోసమే ఇప్పటి వరకు రూ.50,763 కోట్లు ఖర్చు చేశామని, దేశంలోనే ఇది అతిపెద్ద డిబిటి కార్యక్రమం అని చెప్పారు. ప్రజలకు సంతృప్తి ఇస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో 17 నెలలుగా తాను స్వయంగా పాల్గొని అందిస్తున్నానని తెలిపారు. సోమవారం జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించటంతో పాటు ప్రజలతో నేతలు మమేకం కావాలని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించి చెబితే కూటమిని కాదని పక్క పార్టీలకు ప్రజలు ఓటు వేయరని తెలిపారు. కార్యకర్తల మనోభీష్టం మేరకే నాయకత్వం ముందుకెళ్లాలని కోరారు. పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి గౌరవిస్తున్నామని చెప్పారు. అందరితో సమన్వయం చేసుకుని పార్టీ శ్రేణులు ప్రజల్లోనే ఉండాలని తెలిపారు. పార్టీ కార్యక్రమాలకు సంబంధించి డిసెంబర్ క్యాలెండర్ రూపొందించామన్నారు. ఉగాది నాటికి మరో 5 లక్షల ఇళ్లను ప్రజలకు అందిస్తామని తెలిపారు. ప్రతి అర్హుడైన పేదవాడికీ సొంత ఇల్లు ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ నెల 3న రైతు సేవా కేంద్రాల్లో వర్క్‌షాప్‌ల ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమం, 5న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమాలు ఉన్నాయని వెల్లడించారు. వీటిల్లో పార్టీ నాయకత్వం, కార్యకర్తలు హాజరుకావాలని చెప్పారు. త్వరలోనే ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఉమ్మడి కుటుంబాలకు మరింత లబ్ధి చేకూర్చే విధానం అమలు చేస్తామన్నారు.

## హిల్ట్‌పై మాట్లాడరేం?..

మొదటి తరువాయి

రాహుల్‌గాంధీకి కూడా ఈ రూ.5 లక్షల కోట్ల అవినీతిలో భాగస్వామ్యం ఉన్నట్టేనని అనుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు కేటీఆర్ ఆదివారం రాహుల్‌గాంధీకి బహిరంగ లేఖ రాశారు. హిల్ట్ పాలసీలోని లోపాలు, లక్షల కోట్లను కొల్లగొట్టేందుకు తెలంగాణ సర్కారు చేస్తున్న యత్నాలను రాహుల్ దృష్టికి తీసుకెళ్లారు.

**స్వతంత్ర భారత్‌లో అతిపెద్ద స్కాం**

సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రవేశపెట్టిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) పాలసీ స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద కుంభకోణాల్లో ఒకటని కేటీఆర్ అభివర్ణించారు. అత్యంత అవినీతి, అక్రమాలతో కూడుకున్న ఈ విధానం నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల్లో అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నదని, తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ భూ వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలుసా? లేక తెలిసినా కావాలనే మౌనంగా ఉన్నదా? అని తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఈ అవినీతి, అక్రమ పాలసీ కారణంగా అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలు మార్కెట్ విలువలో నామమాత్రపు ధరకే సొంతం చేసుకొనే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. వెరసి తెలంగాణకు రూ.5 లక్షల కోట్ల నష్టం వాటిల్లనున్నదని హెచ్చరించారు.

**విలువైన భూములు 30 శాతం ఎస్ఆర్వోకే ధారాదత్తం..**

హైదరాబాద్ నగరంలోని బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, ఉప్పల్, మల్లాపూర్, రామచంద్రాపురం, హయత్‌నగర్ లాంటి కీలక ఇండస్ట్రియల్ క్లస్టర్లలో గత ప్రభుత్వాలు 9,300 ఎకరాల భూమిని పారిశ్రామిక అవసరాలకు కేటాయించాయని కేటీఆర్ వివరించారు. ఈ భూములను మొదట పారిశ్రామిక వృద్ధి, ఉపాధి కల్పన, దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో రాయితీ ధరలకు కేటాయించారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కారు హిల్ట్ పాలసీ కింద ఈ భూములను వాణిజ్య లేదా నివాస జోన్లుగా మార్చుకొనేందుకు ఎస్ఆర్వో విలువలో కేవలం 30 శాతం మాత్రమే తీసుకొని కట్టబెడుతున్నదని ఆరోపించారు. ప్రస్తుతం ఆయా చోట్ల మార్కెట్ ధరలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కానీ ప్రభుత్వం మాత్రం ప్రజలకు దక్కాల్సిన ఆస్తులను అగ్గువకు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు.

# కరీంనగర్ జాగృతిలో పలువురి చేరిక

**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా కార్యాలయంలో జాగృతి సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో సుభాష్ నగర్ ముదిరాజ్ సంఘానికి చెందిన పలువురు నాయకులు జాగృతిలో చేరారు. బసవేణి రాజేందర్, జంగా సాగర్, పిట్టల వెంకటేష్, బోండ్ల అజయ్, బోయిని దిలీప్, అరిగే ప్రేమ్ సాగర్, కుంభం శివ తదితరులు జాగృతిలో చేరగా, జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ



కరీంనగర్ జిల్లాలో తెలంగాణ జాగృతి బలోపేతం అవుతోందని, ప్రజా సమస్యల పరిష్కార వేదికగా కవిత నాయకత్వంలో పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బీసీలకు న్యాయమైన రిజర్వేషన్ సాధన కోసం జాగృతి కృషి చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ మోసపూరిత విధానాలకు ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో సమాధానం చెప్పాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ వచ్చేంతవరకు జాగృతి పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆదివాసి విభాగం అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, మహిళా విభాగం నాయకురాలు జంగ అపర్ణ, యువజన నాయకుడు హుస్నాబాద్ రాజ్ కుమార్, జిల్లా నాయకుడు గర్షకుర్తి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయండి

**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో మెదక్ పట్టణంలో జరగనున్నాయి. ఈ సందర్భంగా డిసెంబర్ 7న ఉదయం 11.30 గంటలకు చిల్డ్రన్ పార్క్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేయబడింది. సభకు సిఐటియు ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి.వి. రాఘవులు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కె. హేమలత, రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తదితర నాయకులు పాల్గొని ప్రసంగించనున్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ 1970 నుండి




కార్మిక వర్గాన్ని ఏకం చేస్తూ హక్కుల కోసం ఐక్య పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నయా ఉదారవాద విధానాలు, మత విధానాల దూకుడుతో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలకు సమాధానంగా రాష్ట్ర మహాసభలు వేదికగా నిలుస్తాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లు తీసుకురావడం, విద్యుత్ సవరణ బిల్లుతో ప్రజలకు నష్టం కలుగుతోందని విమర్శించారు. సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మరిన్ని పోరాటాలకు కార్మిక వర్గాన్ని సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. "సోషలిజం %-% ప్రజాస్వామ్యం, కార్మిక వర్గ విస్తృత పోరాటం" అనే నినాదంతో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు యు. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్, కోశాధికారి జి. రాజేశం పాల్గొన్నారు.

# విద్యార్థులు శాస్త్రీయ విద్యకై పోరాడాలి




**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే శాస్త్రీయ విద్య సాధనకై విద్యార్థులు మరింతగా పోరాడాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందిరామయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఉర్దూ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా విధానం ప్రజల్లో మూఢవిశ్వాసాలను పెంచిపోస్తోందని, రైతుల అన్యాయాలు, స్త్రీ పురుష అసమానతలు, స్త్రీలపై హింస వంటి సమస్యలను ఎదుర్కొనే శక్తి ఇవ్వలేకపోతుందని అన్నారు. విద్యార్థులను స్వతంత్ర ఆలోచనలతో తీర్చిదిద్దకుండా పెట్టుబడిదారుల గుమాస్తాలుగా తయారు చేస్తోందని విమర్శించారు. శ్రమను గౌరవించే, సమాజాన్ని పురోగతిపథంలో నడిపే శాస్త్రీయ విద్య కోసం విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. పిడిఎస్యు 23వ జిల్లా మహాసభల సందర్భంగా రాష్ట్ర నాయకులు కాంపాటి పృథ్వి, అనిల్ సాయిబోలా మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యలు పెరుగుతున్నా పాలకులు వాటి పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదని, దీంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని అన్నారు. డబ్బు ఉన్నవారే చదువుకోవాలని పాలకులు సూచిస్తున్నట్టే ఉందని, ఇది సమాజాన్ని వెనక్కి నెడుతుందని విమర్శించారు. అందరికీ విద్య అందించేందుకు పిడిఎస్యు ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ధీరజ్, ఉపాధ్యక్షురాలు కాగితపు పల్లవి, సహాయ కార్యదర్శి చిలుక శ్రీవాణి, కోశాధికారి తాళ్లపల్లి అంజి, కమిటీ సభ్యులు విష్ణు, అశోక్, వైష్ణవి, వెన్నెల, దుగ్యాల సందీప్, కేతిరి అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు. అధ్యక్షత వహించిన అంగడి కుమార్‌తో పాటు జిల్లా నాయకులు హాజరయ్యారు.

## హుస్నాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం చేయండి



**హుస్నాబాద్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుస్నాబాద్ ను రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. డిసెంబర్ 3న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుస్నాబాద్ కేంద్రంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమవతి తో కలిసి సభ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. ప్రజలకు తాగునీరు, పార్కింగ్, భద్రత వంటి సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేశారు. ప్రజాపాలన ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, రోడ్లు, స్కూల్, లింక్ రోడ్లు, అర్బన్ పార్క్, డ్రైవింగ్ ట్రాక్, మహిళా శక్తి బజార్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. అదనంగా మహిళా సంఘాలకు బస్సులు, విద్యార్థులకు సైకిళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, వడ్డీలేని రుణాలు, ఉచిత విద్యుత్, గ్యాస్, రైతు భరోసా వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తారని మంత్రి తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి హుస్నాబాద్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో మండల నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించి, కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులను గెలిపించేందుకు ఐక్యంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మండల అధ్యక్షులు, ఇతర నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్‌టి శిబిరాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్

**సిద్దిపేట, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చేర్యాల మండలం ముస్యాల గ్రామం వద్ద నేషనల్ హైవే వెంబడి ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి శిబిరాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. వాహనాల పరిశీలన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రిజిస్టర్‌లో వాహనం వచ్చిన సమయాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని, విధులు పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. వాహనాల చెకింగ్ వీడియోలను కెమెరాలో పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు 24 గంటలు నిరంతరంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, మొత్తం వీడియోగ్రఫీ తప్పనిసరిగా చేయాలని స్టేట్ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.




## హుజురాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అడిషనల్ డీసీపీ వెంకటరమణ




**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హుజురాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని అడిషనల్ డీసీపీ వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల భద్రతా ఏర్పాట్లను సమీక్షించిన ఆయన, చల్పూర్ వంటి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇటీవల జమ్మికుంటలో జరిగిన హత్య కేసు దర్యాప్తు పురోగతిని తెలుసుకొని, సంఘటనా స్థలాన్ని స్వయంగా సందర్శించారు. కేసు వివరాలు, సాక్ష్యాలను పరిశీలించి క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏసీపీ మాధవి, హుజురాబాద్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అచీవర్స్ హైస్కూల్లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137 a అచీవర్స్ స్కూల్, వాసుదేవ హాస్పిటల్, సిద్ధి ఐ కేర్ సంయుక్తంగా అచీవర్స్ స్కూల్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో కంటి లోపాలు విటమిన్ ఏ, పోషకాహారం లోపం వల్ల ఎక్కువగా వస్తున్నాయని, మొబైల్ ఫోన్ల అధిక వాడకం కూడా చూపు సమస్యలకు కారణమవుతోందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులు బ్లాక్‌బోర్డ్ చూడలేక పక్కవారి పుస్తకం చూసి రాస్తున్నారా అనే విషయాన్ని గమనించి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. ఈ శిబిరం రెండు రోజుల పాటు కొనసాగి, సుమారు వెయ్యి మంది విద్యార్థులకు ఉచిత పరీక్షలు నిర్వహించబడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, అచీవర్స్ స్కూల్ ప్రిన్సిపల్ చెరిమల వెంకటేశ్వర్లు, డాక్టర్ వై. జ్యోతి, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, కుమారస్వామి, నాగేశ్వర్, కొంజర్ల మహేష్, పులాల శ్యామ్, విద్యాసాగర్ రెడ్డి, సుధాకర్, పండుగ నాగరాజు, అడ్వకేట్ సుద్దపల్లి ప్రసాద్, నాజియా, రేణుకతో పాటు అలయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# పలు కుల సంఘాల పెద్దలను కలిసిన వైద్యుల అంజన్ కుమార్



**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఇటీవల కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన వైద్యుల అంజన్ కుమార్ నగరంలోని పలు కుల సంఘాల జిల్లా అధ్యక్షులను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. కుల పెద్దలు చూపుతున్న అభిమానం, ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ అనుబంధం ఎప్పటికీ కొనసాగాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

## కరీంనగర్‌లో ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం




**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సుదీర్ఘకాలం విశేష సేవలందించిన ఇద్దరు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ విభాగానికి చెందిన ఆర్. ఎస్సై కాంతయ్య, కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సై అజ్మత్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డీసీపీ భీంరావు, పోలీస్ ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, దాన్ని విజయవంతంగా పూర్తి చేసి పదవీ విరమణ పొందడం గొప్ప విజయమని అన్నారు. అధికారులు అందించిన సేవలకు కుటుంబ సభ్యుల సహకారం కీలకమని గుర్తు చేశారు. పదవీ విరమణ తర్వాత ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. భీంరావు స్వయంగా ఇరువురు అధికారులకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్స్పెక్టర్ (సంక్షేమం) మేడ కిరణ్ కుమార్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్ జీవో 46పై బీజేపీ ఆందోళన



**కరీంనగర్, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై కరీంనగర్ బీజేపీ శ్రేణులు తీవ్రంగా స్పందించాయి. ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు అడిచర్ల రాజు ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవో ప్రతులను దహనం చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలు మోసమని, 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి ఇప్పుడు స్థానిక సంస్థల్లో కేవలం 22 శాతం మాత్రమే ఇవ్వడం దారుణమని అన్నారు. దీంతో గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. జీవో 46ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేకపోతే రాబోయే ఎన్నికల్లో బీసీలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుజ్జ శ్రీనివాస్, బండ రమణారెడ్డి, ఏన్నం ప్రకాష్, నరహరి లక్ష్మారెడ్డి, గుంజేటి శివకుమార్, శానగొండ వాసు, నాంపల్లి శ్రీనివాస్, మాసం గణేష్, అవదుర్తి శ్రీనివాస్, తిరుపతి సుధాకర్ పటేల్, హరి ప్రసాద్ పటేల్, ఎడ్ల ప్రసన్న, రంగు సంపత్ గౌడ్, కట్ట రాజు, వొద్నలా కోటేశ్వర్, బోయిని శ్రీనివాస్, పైడి ప్రసాద్, పర్వతం మల్లేశం, బత్తిని మహేష్, అజయ్, నారాయణ, తిరుమల్ రెడ్డి, కచ్చకాయల రాజేంద్రప్రసాద్, గుంటుక శంకర్‌తో పాటు వివిధ మోర్చా బాధ్యులు, జోన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ మండలంలో ఎస్ఎస్‌టి శిబిరాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్



**హుస్నాబాద్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లెల్ల గడ్డ గ్రామం వద్ద నేషనల్ హైవే వెంబడి ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) శిబిరాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వాహనాల పరిశీలన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రిజిస్టర్‌లను వెరిఫై చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు 24 గంటలు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, వాహన పరిశీలన మొత్తం వీడియోగ్రఫీ తప్పనిసరిగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అన్ని రిజిస్టర్‌లు సక్రమంగా మెయింటైన్ చేస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్శనలో ఆర్డీవో రామ్మూర్తి, డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య తదితర అధికారులు కలెక్టర్‌తో పాటు ఉన్నారు.

## బెల్టు షాపు నడుపుతున్న వారిపై బైండోవర్



**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గ్రామ పంచాయతీ ఎన్నికల దృశ్య మండలంలో బెల్టు షాపులు నడుపుతున్నవారు, గత ఎన్నికల్లో కేసులు ఎదుర్కొన్నవారు, సస్పెక్ట్ షీటర్లపై చర్యలు తీసుకున్నారు. మొత్తం నాలుగు కేసుల్లో 16 మందిని కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టి ఒక్కొక్కరికి లక్ష రూపాయల పూచీకతుపై బైండోవర్ చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఇకపై ఎవరైనా బెల్టు షాపులు నడిపితే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఎన్నికల ముగింపు వరకు గ్రామాల్లో ఎలాంటి అలజడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు



**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ప్రకటించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రజల వినతులను స్వీకరించే ఈ కార్యక్రమం ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు నిలిపివేయబడిందని తెలిపారు. ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా తిరిగి ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

### నగర కాంగ్రెస్ కార్యాలయం సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయంగా మారింది

**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి నగరం మధ్యలో జ్యోతిరావు పూలే (సర్కస్) గ్రౌండ్ వెనుక ఉన్న కార్యాలయాన్ని వినియోగించారు. ఇటీవల జిల్లా, నగర అధ్యక్షులు మారడంతో ప్రస్తుతం సుడా చైర్మన్‌గా ఉన్న ఆయన అదే కార్యాలయాన్ని క్యాంపు కార్యాలయంగా మార్చుకున్నారు. సుడా అధికారిక కార్యాలయం జెడ్పీ ఆవరణలో ఉన్నప్పటికీ, పార్టీ కార్యకర్తలు, నాయకులను కలుసుకోవడానికి సెలవు దినాల్లో అందరికీ అందుబాటులో ఉండేలా ఈ క్యాంపు కార్యాలయాన్ని ఉపయోగించనున్నట్లు సమాచారం.




## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్




**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలకు గాను అకడమిక్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించబడింది. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి తెలిపారు కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ వారు నియమించిన ఇద్దరు సభ్యుల బృందం కళాశాల అన్ని విభాగాలను సందర్శించి, విద్యార్థినులు సాధించిన ఫలితాలు, ప్రాజెక్టులు, సేవా కార్యక్రమాలు, ఉన్నత చదువులు, విభాగాల ప్రత్యేకతలు, క్షేత్ర పర్యటనలు, అధ్యాపకుల అభివృద్ధి కోసం చేసిన కోర్సులు తదితర అంశాలను పరిశీలించారు. ఆడిట్ బృందంలో ప్రొఫెసర్ ఎ. అశోక్, సీనియర్ అధ్యాపకురాలు డా. ఎన్. వాసవి ఉన్నారు. ఈ ఆడిట్ "నాక్" గుర్తింపు కోసం కళాశాలలకు ఎంతో ఉపయోగకరమని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఐ.క్యూ.ఎ.సి. డా. యం. కల్పన, పరీక్షల నియంత్రణ అధికారి జి. శ్రీనివాస్ రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్లు డా. యన్. మనోజ్ కుమార్, డా. సి. హెచ్. విద్య, డా. బి. రజనీ దేవి, ఇతర అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీల గొంతు నొక్కేందుకే అగ్రవర్ణాల కుట్ర

**- బీసీ నేతల ఆగ్రహం**




**పెద్దపల్లి, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నల్గొండ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న అమానవీయ ఘటనపై బీసీ సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేయబోతున్న బీసీ వర్గానికి చెందిన అభ్యర్థి భార్య నాగలక్ష్మి భర్త యాదగిరిని కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురిచేయడం కలకలం రేపింది. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు కాసిపేట ఉదయ్, నాయకులు గుండవేన స్వామి, ప్రగతి మత్స్య కార్మిక సేవాసమతి అధ్యక్షుడు ఉస్తెం శ్రీనివాస్ మాట్లాడుతూ, యాదగిరిని నామినేషన్ ఉపసంహరించుకోవాలని బెదిరించారని, అతనిపై అమానుషంగా ప్రవర్తించారని ఖండించారు. ఈ ఘటన వెనుక రాజకీయ శక్తులు ఉన్నాయని, అధికార పార్టీకి చెందిన నేతల అనుచరులు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. బీసీలను రాజ్యాధికారంలోనుంచి దూరం చేయాలనే దురుద్దేశంతోనే ఈ కుట్ర జరిగిందని వారు పేర్కొన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీసీ నేతలు మాట్లాడుతూ, ఈ ఘటనతో బీసీ సమాజం భయపడకూడదని, ఏకమై అన్యాయంపై గళం విప్పాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పిలుపు

**పెద్దపల్లి, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
డిసెంబర్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఓదెల మండల నాయకులతో క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. అలాంటి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలంటే స్థానిక సంస్థల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను విజయం సాధింపజేయాలని సూచించారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రజలతో నేరుగా మాట్లాడి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6



గ్యారంటీలు, 420 హామీలు అమలు కాలేదని వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కెసిఆర్ పాలనలో రైతులు రైతుబంధు, రుణమాఫీ, ఉచిత నీటి సౌకర్యాలతో సుఖసంతోషాలతో ఉన్నారని, అయితే కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు లైన్లలో నిలబడుతున్నారని, మహిళలకు వాగ్దానం చేసిన పెన్షన్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లి, బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ గంట రాములు యాదవ్, మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకట్ రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్, మాజీ వార్డ్ సభ్యులు మరియు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్



**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** స్థానిక శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) వృక్షశాస్త్ర విభాగ సహాయ ఆచార్యుడు మరియు సూక్ష్మజీవ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రౌతు రాధాకృష్ణ వృక్షశాస్త్రంలో పీహెచ్డీ పూర్తి చేశారు. మహారాష్ట్రలోని శ్రీ రామానంద తీర్థ మరాఠవాడ విశ్వవిద్యాలయంలో ఐ ఎమ్ ఎస్ బీ ఎఫ్ పీ పీ అనే అంశంపై ఐదు సంవత్సరాలపాటు పరిశోధనలు చేసి విజయవంతంగా డాక్టరేట్ పొందారు. వీరికి ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. జగన్మోహన్ రెడ్డి గైడ్‌గా, ప్రొఫెసర్ పి.వి. పవర్ సహా గైడ్‌గా వ్యవహరించారు. సైన్స్ డీన్ డాక్టర్ బి.ఎస్. సుర్వాసే పీహెచ్డీ అవార్డును ప్రకటించారు. డాక్టర్ రాధాకృష్ణను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. నితిన్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తిరు కోవెల శ్రీనివాస్, ఇతర అధ్యాపకులు, విభాగాధిపతులు, సహాధ్యాపకులు ఘనంగా అభినందించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కుటుంబ సభ్యులు ఆకుల శ్రీలత, రౌతు మేఘన, రౌతు సాయికిరణ్ మరియు ఇతరులు హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ రౌతు రాధాకృష్ణ మాట్లాడుతూ: "కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, సహ అధ్యాపకుల తోడ్పాటు, పరిశోధనపై మక్కువ, కరోనా కాలం నుంచి అలుపెరగని కృషి నేడు పీహెచ్డీ రూపంలో ఫలితమిచ్చింది" అని ఆనందం వ్యక్తం చేశారు.

## హుస్నాబాద్ సభ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** డిసెంబర్ 3న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యే బహిరంగ సభ స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ హైమవతి పరిశీలించారు. సభ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్, రెండు సంవత్సరాల క్రితం హుస్నాబాద్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించారని, ఆ విశ్వాసానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ముఖ్యమంత్రి హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, పూర్తయిన పనులను ప్రారంభిస్తారని వెల్లడించారు. శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ భవనం, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, రాజీవ్ రహదారి నుండి హుస్నాబాద్ వరకు 4 లేన్ రహదారి, అక్కన్నపేట–హుస్నాబాద్ రహదారి, కోహెడలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, గిరిజన గ్రామాలకు లింక్ రోడ్లు, హుస్నాబాద్ మున్సిపాల్టీ అభివృద్ధి పనులు, ఆర్టీఏ కార్యాలయం, ఇందిరా మహిళా శక్తి బజార్, ఉమ్మాపూర్ అర్బన్ పార్క్ వంటి ప్రాజెక్టులకు శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. అదనంగా, మహిళా సంఘాలకు బస్సులు, విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ, 250 పడకల ఆసుపత్రి, ఎల్లమ్మ చెరువు, మహాసముద్రం గండి టూరిజం, రింగ్ రోడ్, కబడ్డీ అకాడమీ, స్టేడియం, మార్కెట్ యార్డు, కాటన్ మార్కెట్, పల్లె చెరువు, కొత్త చెరువు అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. హుస్నాబాద్‌ను ఆదర్శ నియోజకవర్గంగా, ఉత్తర తెలంగాణ కోనసీమగా తీర్చిదిద్దుతామని, అన్ని వర్గాల నేతల సలహాలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను ఘనంగా విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఎన్నికల నిబంధనలపై అప్రమత్తంగా ఉండాలని సూచన




**హుస్నాబాద్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సాధారణ ఎన్నికల పరిశీలకుడు వి. వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు అత్యంత కీలకమైన ఘట్టమని, పత్రాలలో ప్రతి అంశం నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో జాగ్రత్తగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీలు పరిష్కారం, గుర్తుల కేటాయింపు, అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థుల ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, గోడపత్రాలు, వాహనాల అనుమతులు సంబంధిత మండల అధికారుల ద్వారా మాత్రమే పొందాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆయన స్పష్టం చేశారు.

## 68వ సారి రక్తదానం చేసిన ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి



**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా సెక్రటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి 68వ సారి రక్తదానం చేశారు. అపోలో రీచ్ హాస్పిటల్‌లో హెడ్ ఇంజరీతో చికిత్స పొందుతున్న మిత్రునికి బ్లడ్ సెంటర్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి. కేశవ రెడ్డి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో సెక్రటరీ ఎల్లప్పుడూ ముందుంటారని, ఇప్పటివరకు గవర్నర్ల చేత బ్లడ్ డోనార్ అవార్డులు అందుకున్నారని తెలిపారు. రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా అవసరమైనప్పుడు రక్తదానం చేస్తానని, యువత ముందుకు వచ్చి బ్లడ్ బ్యాంకుల్లో రక్తదానం చేయాలని, ఇది ప్రాణాలను కాపాడే గొప్ప సేవ అని అన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు



**పెద్దపల్లి, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** పెద్దపల్లి కలెక్టరేట్‌లో డిసెంబర్ 1న జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రకటించారు. ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు. పంచాయతీ ఎన్నికల మాడల్ కోడ్ అమలులో ఉండటంతో అధికారులు క్షేత్రస్థాయిలో ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

## ఎర్రజెండా గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలి

**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** గంగాధర మండలం మంగపేట గ్రామపంచాయతీ ఎనిమిదో వార్డులో సిపిఐ అభ్యర్థి షేక్ యాకూబ్ బి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం నిరంతరం పోరాటం చేసే ఎర్రజెండాను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న షేక్ యాకూబ్ బి వంటి వ్యక్తులు గ్రామపంచాయతీలో ఉండటం ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ సత్తాను కరీంనగర్ జిల్లాలో చాటాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి షేక్ మౌలానా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం





**నిజాంబాద్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నిజాంబాద్ టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఇందూర్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానిక్ వృత్తి సామాన్య ప్రజల జీవితంలో కీలకమని, వీరి సేవలు సమాజానికి అపూర్వమని అన్నారు. గ్రీజు, డస్ట్ మధ్య కఠిన పరిస్థితుల్లో పనిచేస్తున్న మెకానిక్‌ల ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ క్యాంపులు, జీవిత బీమా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందేలా కృషి చేస్తానని తెలిపారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, అసోసియేషన్ అభివృద్ధికి ఎమ్మెల్యే ఫండ్ ద్వారా సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. దేశ అభివృద్ధి పథంలో ప్రతి వృత్తివర్గం భాగస్వామ్యం కావాలని, ప్రధాని నరేంద్ర మోదీ "సబ్కా సాథ్ – సబ్కా వికాస్" నినాదం అందరికీ చేరేలా కృషి చేస్తానని చెప్పారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు, కార్యదర్శి సహా నూతన కార్యవర్గ సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి పొతంకార్ లక్ష్మీనారాయణ, లీగల్ అడ్వైజర్ రాజేందర్ రెడ్డి, స్టేట్ మెకానిక్ ప్రెసిడెంట్ బాబు, వైస్ ప్రెసిడెంట్ గజ్జల మురళి, ప్రచార కార్యదర్శి శ్రీకాంత్, కామారెడ్డి బాబా, గంగారం, రామచంద్ర, గంగాధర్, బీజేపీ నాయకులు పవన్, గుండా సతీష్, భాస్కర్, అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ ఉన్నత పాఠశాల ధన్గర్ వాడి విద్యార్థుల సైన్స్ ప్రదర్శన





**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** ప్రభుత్వ ఉన్నత పాఠశాల ధన్గర్ వాడి విద్యార్థులు రూపొందించిన సైన్స్ ఎక్స్పరిమెంట్స్ అందర్నీ ఆకట్టుకున్నాయి. పీ. కార్తీక్ తయారు చేసిన మంకీ గన్, విజయేందర్ రూపొందించిన యాక్సిడెంట్ ఫ్రీ బస్సు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించిన వసుంధర రాజేష్‌తో పాటు ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు ప్రశంసలు అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. ప్రమోద విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

## సామాజిక సేవలో వికలాంగులకు ట్రై సైకిళ్లు అందజేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మీర్పేట్, నవంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వికలాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నంది హిల్స్‌కు చెందిన జూలూరు సైదులు, లెనిన్ నగర్‌కు చెందిన పుల్లయ్య, నేదునూరుకు చెందిన దేవరకొండ అంజయ్యలకు మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి స్వయంగా ట్రై సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులకు సహాయ సహకారాలు అందించడం బాధ్యత మాత్రమే కాక, సామాజిక బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, అవసరాలను గుర్తించి సేవ చేయడం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రామిరెడ్డి, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్, శీను నాయక్, మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు రజాక్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ, రాళ్లబండి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన

## ప్రజావాణి రద్దు





**సిద్దిపేట, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదివారం మిట్టపల్లి, పొన్నాల క్లస్టర్లలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిట్టపల్లి, పాండవపురం, మందపల్లి గ్రామాలు, అలాగే పొన్నాల, కిష్టసాగర్, నాంచార్‌పల్లి గ్రామాల్లో నామినేషన్లు స్వీకరించబడుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు జరుగుతాయని, రెండో విడతలో 10 మండలాల్లో నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 58 క్లస్టర్లలో నామినేషన్లు స్వీకరించబడుతున్నాయి. అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు, నామినేషన్ పత్రాలను ఆర్వోలు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. క్లస్టర్ పరిధిలో 100 మీటర్లలో అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే అనుమతించాలని, బందోబస్తు కట్టుదిట్టంగా ఉండాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు. డిసెంబర్ 1న కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రద్దు చేసినట్లు కలెక్టర్ హైమావతి ప్రకటించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం జరగదని, ప్రజలు కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

# చెస్ మేధాశక్తిని పెంచే ఆట

**- ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి: మాజీ మేయర్ సునీల్ రావు**





**కరీంనగర్, నవంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ భగత్‌నగర్‌లోని చైతన్య యూత్ క్లబ్‌లో జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో 18వ తెలంగాణ స్టేట్ ఓపెన్ & జూనియర్స్ చెస్ టోర్నమెంట్ -2025 ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ ఆట మేధాశక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి మనిషి తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన గేమ్ అని అన్నారు. జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ అనూప్ సేవలను గుర్తు చేస్తూ, వేద భవన్, బాలకుటీర వంటి సంస్థల్లో వందలాది విద్యార్థులకు ఉచితంగా చెస్ నేర్పించడం గొప్పతనమని అభినందించారు. అనంతరం చెస్ గేమ్‌లో తొలి ఎత్తు వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ చైర్మన్ కంకటి కనకయ్య, చైతన్య క్లబ్ నిర్వాహకులు ధోలి ఉపేంద్రనాథ్, బొంతల ప్రవీణ్ కుమార్, వర్ధినేని వెంకట్రావు, పండుగ నాగరాజు, బత్తిని మధు, నూనె సాయికృష్ణ, అకాడమీ డైరెక్టర్ అనూప్ కుమార్, కోఆర్డినేటర్ సృజన్ కుమార్, కోచ్‌లు అభిరామ్, రేవిక్, అరుణ్ ప్రభు, శ్రీనిజ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాల్ బిఆర్ ఎస్ సర్పంచి అభ్యర్థిగా ఆనంద్ నామినేషన్



**కడ్తాల్, నవంబర్ 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: కడ్తాల్ బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిగా మాజీ వైస్ ఎంపిపి ఆనంద్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సమక్షంలో నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు దశరథ్ నాయక్, లక్ష్మి నర్సింహారెడ్డి, గంప వెంకటేష్, రామకృష్ణ, శ్రీను, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# ఆర్కపల్లి అభివృద్ధే లక్ష్యం

**ఏకగ్రీవంగా ఆశీర్వాదం ఇవ్వాలని రజిత శ్రీనివాస్ విజ్ఞప్తి**



**మాడుగుల, నవంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆర్కపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన దండు రజిత శ్రీనివాస్ గౌడ్, గ్రామ ప్రజలకు తన సేవలను గుర్తించి ఈసారి ఏకగ్రీవంగా ఎన్నిక చేయాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా పదవులు లేకపోయినా, గ్రామ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, రాజకీయ-ఆధ్యాత్మిక -సాంస్కృతిక రంగాల్లో ప్రజలను చైతన్యం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా ప్రజల పక్కనే నిలబడి సహాయం అందించానని, అదే నిబద్ధతతో మరింత సమగ్ర అభివృద్ధి సాధించాలనే సంకల్పంతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని ఆయన అన్నారు. రెండు పిల్లల నిబంధన ఎత్తివేతతో గ్రామ ప్రజలు, మిత్రులు, శ్రేయోభిలాషులు తనను ముందుకు నెడుతున్నారని, వారి ఆశీస్సులు తన బలం అని పేర్కొన్నారు. ఆర్కపల్లిలో శాశ్వత అభివృద్ధి కోసం శుద్ధి త్రాగునీరు, రోడ్లు, మురుగు వ్యవస్థ, విద్య, ఆరోగ్యం, సామాజిక సామరస్యం వంటి రంగాల్లో లక్ష్యపూర్వక చర్యలు తీసుకుంటానని రజిత శ్రీనివాస్ వెల్లడించారు. ఏ వర్గానికీ అన్యాయం లేకుండా అందరికీ అందుబాటులో ఉండే నాయకత్వం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పండుగలు, ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు లేదా ప్రజా అవసరాల విషయంలో ఎప్పుడూ ముందుండి వ్యవహరించిన తన గత సేవలనే గ్రామ ప్రజలు గుర్తించి, ఎన్నికల వ్యయం లేకుండా ఏకగ్రీవంగా అభివృద్ధికి దోహదం చేయాలని కోరారు.

# రాష్ట్రంలోని 12 డి ఎస్ సి డి ఓ పోస్టులను తక్షణమే మంజూరు చేయాలి...





మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ...

**మహబూబ్ నగర్, నవంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ లోని 12 డిఎస్సిడిఓ పోస్టులను తక్షణమే మంజూరు చేయాలని టి జి ఎస్ సి డి డి స్టాఫ్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. 12 జిల్లాలలో పూర్తిస్థాయి జిల్లా అధికారులు లేకపోవడం వలన పాలనలో స్తబ్దత ఏర్పడిందని ఎఫ్ ఎ సి అధికారులు పూర్తి సమయాన్ని కేటాయించలేకపోతున్నారని రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి మహబూబ్ నగర్ ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి స్థానిక సూపరింటెండెంట్ జి. తిరుపతయ్య గౌడ్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర కోశాధికారి కే. జీవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ .చంద్రశేఖర్, కావలి కవిత ముదిరాజ్, సీనియర్ సూపరింటెండెంట్ రాంజీ రావు తదితరులు హాజరైన ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపరింటెండెంట్ లను ఏవోలుగా గెజిటెడ్ హోదా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా జూనియర్ అసిస్టెంట్ కం టైపిస్టులను జూనియర్ అసిస్టెంట్ లుగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిబ్బందికి 25% కోటాను కల్పించాలని, జిల్లాలో కేడర్ స్ట్రెంత్ ను పెంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పూజరీ నరసింహులు, విష్ణుమూర్తి, కూన స్కైలాబ్, రుష్యేంద్ర ఠాగూర్, తిరుపతయ్య, ప్రవీణ్ కుమార్, రమేష్, కిరణ్ కుమార్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహా పాదయాత్ర పూర్తి చేసిన అయ్యప్ప భక్తునికి ఘన సన్మానం



**ఎలిగేడు, నవంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన బుర్ర అజయ్ గౌడ్ అయ్యప్ప మాల ధరించి 48 రోజుల క్రితం ఎలిగేడు మండల కేంద్రంలోని కోదండరామాలయంలో ప్రారంభించిన మహా పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. మొత్తం 1550 కిలోమీటర్లు నడిచి అయ్యప్ప దర్శనం చేసుకుని స్వగ్రామం ఎలిగేడుకు చేరుకున్న అజయ్ స్వామిని ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీపీ, హైకోర్టు అడ్వకేట్ బుర్ర వీరస్వామి గౌడ్, అయ్యప్ప గురు స్వామి మామిడాల రమేష్, కేశెట్టి కాశీనాథం, కవ్వంపల్లి చంద్రయ్య, రంగు శ్రీనివాస్ గౌడ్ తదితరులు అజయ్ స్వామికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా గురు స్వామి మామిడాల రమేష్ మాట్లాడుతూ ం "భక్తిశ్రద్ధలతో ఏ కార్యం తలపెట్టినా అయ్యప్ప కరుణ కటాక్షాలు ఉంటే సాధ్యం కానిది ఏది లేదు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన గుర్రం మల్లేశం గౌడ్, ఐట్ల శ్రీనివాస్, బుర్ర గణేష్ స్వామి, శివ స్వామి, తాటిపల్లి సతీష్ బాబు, రాకేష్‌తో పాటు అయ్యప్ప స్వాములు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# పంచాయితీఎన్నికలు ప్రశాంతంగా జరగాలి











**కడ్తాల్, నవంబర్ 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల సందర్భంలో, శంషాబాద్ డీసీపీ రాజేష్, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ ముచ్చర్ల ఎక్స్ రోడ్ చెక్‌పోస్ట్‌ను, అలాగే కడ్తాల్ గ్రామ పంచాయతీ భవనంలోని నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు కడ్తాల్ (SST, FST) బృందాలతో పరస్పరం మాట్లాడి సిబ్బందికి అవసరమైన సూచనలు అందించారు. అదనంగా, చెక్‌పోస్టులో జరుగుతున్న వాహనాల తనిఖీలను ప్రత్యక్షంగా పరిశీలించారు, పోలింగ్‌కు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ, బృందాల మోహరింపు వంటి అంశాలను సమీక్షించారు, ఎన్నికల నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమలు విషయంలో సిబ్బందిని మరింతగా అప్రమత్తం చేయాలని సూచించారు, నామినేషన్ కేంద్రంలో అభ్యర్థుల రాకపోకలు, భద్రత, చర్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారని ఇన్స్పెక్టర్ గంగాధర్ తెలిపారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలలో వామపక్ష లౌకిక శక్తులను గెలిపించండి


## సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారీ ఐలయ్య.




**దేవరకొండ నవంబర్ 30. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
పంచాయతీ ఎన్నికల్లో వామపక్ష లౌకిక శక్తులు బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారీ ఐలయ్యప్రజలను కోరారు ఆదివారం రోజున దేవరకొండలో జరిగిన సిపిఎం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నిజాయితీతో పనిచేసే సిపిఎం బలపరిచిన అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. డబ్బులు,మద్యం ,కులం, మతం, ప్రాంతం వివిధ ప్రలోభాలతో వచ్చే అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ఇప్పటికీ గ్రామాల్లో పారిశుద్ధ్యం మంచినీళ్ల మురికి కాలువలు సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, వీటికి పరిష్కారం రావాలంటే సిపిఎం బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడపడానికి ముందుంటామని అన్నారు. వివిధ రాజకీయ పార్టీలు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తున్నాయని ప్రజలు విజ్ఞతతో ఓటు వేయాలని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 40 కార్మిక చట్టాన్ని కుదిస్తూ నాలుగు కొడులుగా తీసుకురావడం జరిగింది వాటి ఫలితంగా కార్మికులు రోజుకు 12 గంటలు పని చేయాల్సి వస్తుందని హక్కుల కోసం సమ్మె చేసే పరిస్థితి అలాగే సంఘాలు పెట్టుకోకుండా నాలుగు లేబర్ కోడులు పనిచేస్తాయని కార్మికులకు నష్టం చేసే వాటినివెంటనే రద్దు చేయాలని మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చింతపల్లి మండల కార్యదర్శి ఉడుగుండ్ల రాములు ,దేవరకొండ మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య , నేరడి గొమ్ము మండల కార్యదర్శి నాగటి నాగరాజు ,పీఏ పల్లి మండల కార్యదర్శి కావాలి కృష్ణయ్య, నాయకులు బిజిలి లింగయ్య ,నల్ల శ్రీను ,బుడిగ వెంకటేశం ,పోలే యాదయ్య ,ధర్మాపురం, దేవయ్య . ఎడ్ల కాశయ్య,తదితరులు పాల్గొన్నారు.

## దైవచింతనతో మానసిక ప్రశాంతత

**-ప్రతి ఒక్కరూ ఆంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి.**
**-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.**



**దేవరకొండ నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ప్రతి ఒక్కరూ ఆంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణం లోని తులచ్చమ్మ కుంట లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం లో హనుమాన్ గాయత్రి,మహాయజ్ఞం,అభిషేకం మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ,దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని అయన తెలిపారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, బిఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెల్లుగూరి వల్లపు రెడ్డ, పులిరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ చెంచు కుటుంబానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ అండ




**అమ్రాబాద్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండలం మల్లాపూర్ చెంచు పెంటలో ఆకస్మికంగా మరణించిన బయన్న కుటుంబానికి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి అన్ని రకాలుగా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం, రూ.5000 నగదు అందజేశారు. పిల్లలకు హాస్టల్ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, బయన్న భార్యకు ఉపాధి అవకాశాన్ని త్వరలోనే కల్పిస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలక్రిస్టయ్య, యూత్ కాంగ్రెస్ అచ్చంపేట ప్రధాన కార్యదర్శి నరసింహ, స్థానిక ఆదివాసీలు పాల్గొన్నారు.

## వసంత్ విహార్ కాలనీలో సీసీ రోడ్ల ప్రారంభోత్సవం



**జీడిమెట్ల, నవంబర్ 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వసంత్ విహార్ కాలనీలో రూ.24.5 లక్షల వ్యయంతో నిర్మించబడిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా కాలనీలో పర్యటించిన తారా చంద్రారెడ్డి, స్థానిక సమస్యలపై కాలనీ వాసులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి, వసంత్ విహార్ కాలనీ అధ్యక్షుడు దేవేంద్రబాబు నిమ్మగడ్డ, ఉపాధ్యక్షుడు రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వేణు, ఝాన్సీ, చంద్రశేఖర్, వెంకట్, సోనీ, దీపిక తదితరులు పాల్గొన్నారు.

## సన్‌రైస్ టైర్ వరల్డ్ అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలించిన భరత్ సింహ రెడ్డి




**జీడిమెట్ల, నవంబర్ 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న సన్‌రైస్ టైర్ వరల్డ్‌లో మొన్న తెల్లవారుజామున నాలుగు గంటలకు భారీ అగ్నిప్రమాదం జరిగింది. టైర్లు, మెషినరీ పూర్తిగా దగ్ధమై పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది.ఈ ఘటన స్థలాన్ని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పరిశీలించారు. కార్ సెంటర్ యజమాని వెంకట్ రెడ్డి, అక్కడి వర్కర్లు, కాలనీ వాసులను పరామర్శించి, జరిగిన నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. అగ్నిప్రమాదం వల్ల కలిగిన ఇబ్బందులను గుర్తించి, బాధితులకు సహాయం అందించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ సందర్శనలో కాలనీ అధ్యక్షుడు నారాయణ, సతీష్ చక్రవర్తి, ఉమాపతి, వెంకట్ రెడ్డి, ఎం.ఎన్. రెడ్డి, నగర్ అధ్యక్షుడు శ్రీకాంత్, శంకర్, ఎశ్వంత్, కోటేశ్వర్ రెడ్డి, శ్రవణ్ బోస్, శ్రీకాంత్, రోహిత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులను కలిసిన జైపాల్ యాదవ్



**కడ్తాల్, నవంబర్ 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
బీదర్ – మహేశ్వరం 765 కేవి విద్యుత్ లైన్ కారణంగా రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన రైతులకు నష్టం జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ లు సెంట్రల్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులను కోరారు.బీదర్ – మహేశ్వరం (బేగరకంచ) 765కేవి హై టెన్షన్ విద్యుత్ లైన్ పవర్ గ్రిడ్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్నది.ఈ లైన్ వల్ల విలువైన తమ భూములు కోల్పోవాల్సి వస్తున్నదని,పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లనుందని, దీన్ని నివారించాలంటూ రైతులు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తో కలిసి ఎంపీ రవిచంద్రను సంప్రదించారు.అలాగే,ఈ విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు దృష్టికి తీసుకుపోగా,ఆయన సూచన మేరకు ఎంపీ రవిచంద్ర,జైపాల్ యాదవ్ ల ఆధ్వర్యంలో బాధిత రైతులు నవంబర్ 3వతేదీన ఢిల్లీలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ను కలిశారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర, జైపాల్ యాదవ్ కేంద్ర మంత్రి ఖట్టర్ కు వినతిపత్రమిచ్చి రైతులకు నష్టం జరుగకుండా చూడాలని, న్యాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.మంత్రి ఖట్టర్ వెంటనే సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయంలో రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చూడాల్సిందిగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులకు తగు ఆదేశాలిచ్చారు.ఈ మేరకు కార్పొరేషన్ సీజీఎం బిపిన్ బీహారీ రథ్, సీనియర్ కన్సల్టెంట్ అశోక్,డీజీఎం సంతోష్ తదితరులు ఆదివారం ఎంపీ రవిచంద్ర,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డిలతో పాటు రైతులతో సమావేశమయ్యారు.హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఎంపీ రవిచంద్ర క్యాంప్ కార్యాలయంలో సుమారు 3గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ఈ విద్యుత్ లైన్ ఏర్పాటు వల్ల రైతులకు అన్యాయం జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు.ఎంపీ వద్దిరాజు,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ లు విద్యుత్ లైన్ మ్యాపులను అధికారులకు చూపిస్తూ పలు సూచనలు చేశారు,సలహాలిచ్చారు. రవిచంద్ర, జైపాల్ యాదవ్ ల సూచనలు,రైతుల ఆవేదన, ఆందోళన గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అన్యాయం జరుగకుండా చూస్తానని సీజీఎం బిపిన్ బీహారీ రథ్ హామీనిచ్చారు.ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గంపా వెంకటేష్,రైతులు పిప్పల వెంకటేష్,కడారి రామకృష్ణ,గూడూరు పెంటారెడ్డి, గూదె పర్వతాలు, జెల్లా శివరామకృష్ణ, క్యామ సత్యం,గూదె రాములు,కందికంటి శ్రీరాములు, అభిషేక్ రెడ్డి,గూదె రాజు, రాజేందర్ యాదవ్,వరికుప్పల యాదయ్య,కందికంటి కేశవులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో వేడెక్కిన పంచాయితీ పోరు..






## గ్రామాల్లో ఉపందుకున్న ప్రచారాలు



**కడ్తాల్, నవంబర్ 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఇప్పుడిప్పుడే రాజకీయాలు వేడెక్కుతున్నాయి. గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానా లకు పోటీ చేసే అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల్ మండలాల్లోని గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొన్నది. బీసీలు, జనరల్‌కు కేటాయించిన సర్పంచ్ స్థానాల్లో పోటీ తీవ్రంగా ఉన్నది. ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా అని చూస్తు న్న ఆశావహులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఇప్పట్లో ఎన్నికలు జరిగవని కొందరు భావించినప్పటికీ, అకస్మాత్తుగా ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లడంతో పోటీ చేసే అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలంటే సర్పంచ్ అభ్యర్థికి కనీసం 10 నుంచి 50 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుండగా, వార్డు సభ్యులకు పోటీచేసే అభ్యర్థులకు లక్ష రూపాయల వరకైనా ఖర్చు అవుతు న్నాయి. ఈ నేపథ్యంలో డబ్బుల కోసం అప్పులు చేసే పరిస్థితి నెలకొన్నది. అలాగే పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా బ్యాంకుల్లో కరెంట్ అకౌంట్ తీయాలనే నిబంధన ఉండడంతో బ్యాంకుల వద్దకు అభ్యర్థులు పరుగులు తీస్తున్నారు.

**గ్రామాల్లో మొదలైన దావతులు..**
గ్రామపంచాయతీ ఎన్నికలతో రాజకీయాలు వేడె క్కాయి. ఆయా వర్గాల ప్రజల మద్దతు కూడగట్టేందుకు అభ్యర్థులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కుల సంఘాల వారీగా, యువకులను ఆకర్షించేందుకు అప్పుడే దావతులను మొదలుపెట్టారు. గ్రామాల్లో ఎవ రిని గెలిపిస్తే బాగుంటుందని చర్చ కూడా ప్రజల్లో మొదలైంది. పోటీ లో నిలవాలనుకునే అభ్యర్థులు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈసారి తమకే మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరుతున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన అభ్యర్థుల మధ్య పోటీ ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు ఇద్దరికీ పైగా నామినేషన్లు వేసేందుకు సిద్ధం కాగా వారిని బుజ్జగించేందుకు నాయకులు రంగంలోకి దిగుతున్నారు. ఓటర్లను తమ వైపునకు తిప్పుకొని ఎన్నికల్లో గెలుపొందేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని తహతహలాడుతున్నారు.

## మెడ్ ప్లస్ ఫార్మసి సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్

-వినియోగదారులకు మెరుగైన సేవలు అందించండి

-డి సి సి అధ్యక్షురాలు ఉమా, మాజీ డీసీసీ అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చంద్రారెడ్డి



**మహబూబాబాద్, నవంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని నర్సంపేట రోడ్డుకు గుగులోత్ అనిత నూతనంగా ఏర్పాటుచేసిన మెడ్ ప్లస్ ఫర్మసి సెంటర్ ను డీసీసీ అధ్యక్షురాలు భూక్య ఉమా -మురళీ నాయక్ ఎమ్మెల్యే, మాజీ డీసీసీ అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చంద్రారెడ్డి లు ప్రారంభించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల నుండి మెడ్ ప్లస్ సేవలను వినియోగించుకోవాలని, మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని ప్రజలు మెడ్ ప్లస్ షాపును సందర్శించి అవసరమైన మందులను తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మెడ్ ప్లస్ యజమానియానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు, మాజీ వార్డు కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు..

## ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజావాణి నిలిపివేత

-జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు.



**మహబూబాబాద్,నవంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు-2025 నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా నిలిపివేయబడిందని జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ప్రజావాణి మళ్లీ నిర్వహించబడుతుందని ఆయన స్పష్టం చేశారు.ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ విజ్ఞప్తి చేశారు.

## అజయ్‌ని వరించిన జిల్లాస్థాయి విజయం

గణపురంప్రధానోపాధ్యాయులకు

-డిఈఓ ప్రశంస పత్రము



**వనపర్తి,నవంబర్ 30( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చిట్యాలలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన-2025-26లో ఖిలా ఘనపూర్ జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాల విద్యార్థి అజయ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. ఎమర్జింగ్ టెక్నాలజీ సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యాడు.ఈ విజయానికి మార్గదర్శకత్వం వహించిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బి. శ్రీనివాసులు కృషి విశేషం. విద్యార్థిని ప్రోత్సహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాళిదాసు గారి పాత్రను గుర్తిస్తూ, జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని స్వయంగా ప్రశంస పత్రము అందించారు. పాఠశాల ప్రగతికి, విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి చూపుతున్న కృషిని డిఈఓ ప్రత్యేకంగా అభినందించారు.రాష్ట్రస్థాయిలో కూడా అజయ్ మరింత మెరిసి విజయపతాక ఎగరవేయాలని అధికారులు, ఉపాధ్యాయులు ఆశీర్వదించారు.

## వీధి వ్యాపారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

:బొడ్డుపల్లి ధనుంజయ్



**నల్లగొండ,నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
పట్టణ వీధి వ్యాపారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నూతన అధ్యక్షుడు బొడ్డుపల్లి ధనుంజయ్ అన్నారు. ఆదివారం పెట్టి వేండర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ప్రభుత్వం సర్వ తీసుకుని తగిన స్థలాలు కేటాయించడంతో పాటు వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం అండగా నిలవాలని అన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొడ్డుపల్లి ధనుంజయ్, ముఖ్య సలహాదారులుగా ఎండి మోహినుద్దీన్, గౌరవ అధ్యక్షులుగా గుమ్మల మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పద్మనాభుని భరత్ కుమార్, కోశాధికారిగా దామర శీను, ఉపాధ్యక్షులుగా పులిపాటి వెంకటయ్య, సహాయ కార్యదర్శిగా కర్నాటి నారాయణ, కార్యవర్గ సభ్యులుగా కోటగిరి నరేష్, పల్లా సోమయ్య లు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఐన్ టి యూ సి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా జనరల్ సెక్రెటరీ జమాలుద్దీన్ లు అభినందించారు

## ట్రస్మా నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షుడిగా నింబారి రమేష్ రెడ్డి




**నల్లగొండ, నవంబర్ 30( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ట్రస్మా నల్గొండ పట్టణ జనరల్ బాడీ సమావేశం స్థానిక చర్లపల్లి లోని విపస్య స్కూల్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ పట్టణ అధ్యక్షుడు పోలోజు నాగేందర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ట్రస్మా రాష్ట్ర కోశాధికారి పట్టోల్ల రాఘవేంద్ర రెడ్డి గారు, జిల్లా అధ్యక్షుడు ముక్కముల రామ్‌మోహన్ ఆధ్వర్యంలో పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.గౌరవ సభ్యుల మద్దతుతో,నూతన పట్టణ అధ్యక్షుడిగా నింబారి రమేష్ రెడ్డి,జనరల్ సెక్రటరీగా,మహ్మద్ ఫయాజ్ ట్రెజరర్ గా మదాను భరన్ గౌరవ అధ్యక్షుడుగా మాసిన జానా రెడ్డి మిగతా కార్యవర్గ సభ్యులనూ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం చే ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యవహర్తలు జి. సత్యనారాయణ రెడ్డి , ఏ. శ్యామ్ సుందర్ రెడ్డి , విష్ణు వర్ధన్ రెడ్డి, యాదయ్య, జోసెఫ్, మరియు పట్టణం లోని వివిధ పాఠశాలల వ్యవహర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా వివేక్ వెంకటస్వామి పుట్టినరోజు వేడుకలు.



**ఎలిగేడు, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి 68వ పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఎలిగేడు కాంగ్రెస్ నాయకులు అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సీట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ట్రస్టు ద్వారా ఎంతో మందికి సాయం చేస్తూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేత అని రాబోయే రోజుల్లో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సెగ్యమ దయాకర్ శర్మ, అడ్డగుంట శ్రీనివాస్ గౌడ్, ఎలిగేడు సింగిల్ విండో డైరెక్టర్ తాటి పెల్లి రమేష్ బాబు, ఎలిగేడు మాజీ సర్పంచ్ మండిగ రాజనర్సయ్య, కాంగ్రెస్ నాయకులు చింతకుంట మనోహర్ రావు, అమ్ముల కుమార్, రాములు, కట్ల ప్రకాష్,మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న మంతెన అరుణ స్మారక జిల్లా స్థాయి చదరంగం పోటీలు


ఛాంపియన్ ఎం వాసుదేవ్

**ఎలిగేడు, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎలిగేడు మండల కేంద్రంలోని పెద్ద పెల్లి అమర్చంద్ కళ్యాణమండపం (రిక్రియేషన్ క్లబ్)లో ఆదివారం జరిగిన మంతెన అరుణ స్మారక జిల్లా స్థాయి అండర్ -15 చదరంగం పోటీలు ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ మేధాశక్తిని చాటుతూ పోటీల్లో ప్రతిభ కనబరిచారు.విజేతలకు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా క్రీడాకారుల తల్లిదండ్రులు కూడా హాజరై పిల్లలను ప్రోత్సహించారు.కార్యక్రమంలో జిల్లా చదరంగం సమైక్య అధ్యక్షుడు గడ్డాల శ్రీనివాస్, మంతెన సత్యనారాయణ, ఎం. నాగరాజు, మంతెన నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

ఎస్సై కురుమూర్తి



**వెల్దండ, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక సంస్థ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తప్పవని వెల్దండ ఎస్సై కురుమూర్తి హెచ్చరించారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎవరైనా సోషల్ మీడియా ద్వారా విద్వేషపూరితంగా రెచ్చగొట్టే పోస్టులు, వీడియోలు, ఫోటోలు షేర్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.వ్యక్తిగత విషయాలపై పోస్టులు పెట్టకుండా సిద్ధాంతపరంగా ముందుకు సాగాలని సూచించారు. సోషల్ మీడియా కార్యకలాపాలపై నిఘా కొనసాగుతుందని ఎస్సై కురుమూర్తి తెలిపారు.

# నిబద్ధతగల ఉపాధ్యాయుడు బొమ్మెర కృష్ణమూర్తి



**మహబూబాబాద్, నవంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఇరవై ఏడు సంవత్సరాలు ఉపాధ్యాయునిగా పనిచేసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంకర బోర్డ్ నుండి ఉద్యోగ విరమణ పొందుతున్న బొమ్మెర కృష్ణమూర్తి సర్వీస్ మొత్తం నిబద్ధతతో పనిచేసి, ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది ఉత్తమ ఉపాధ్యాయులుగా పేరు తెచ్చుకున్నారని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ అన్నారు. బొమ్మెర కృష్ణమూర్తి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో, యువ కవి తండా హరీష్ అధ్యక్షతన మహబూబాబాద్ లోని వర్తక సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా టిపిటిఎఫ్ మహబూబాబాద్ మండల, జిల్లా శాఖల ఆధ్వర్యంలో బమ్మెర కృష్ణమూర్తి- వనజ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్ మాట్లాడుతూ బమ్మెర కృష్ణమూర్తిగారు 1998 అక్టోబర్ 26న ఉగ్గంపల్లి లోని మాలోత్ తండాలో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి చిన్న గూడూర్, ముదుపుగల్, బ్రాహ్మణపల్లి పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేసి, ఇటీవల స్కూల్ అసిస్టెంట్ గా పదోన్నతి పొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంకర బోర్డ్ నుండి పదవీ విరమణ పొందారని తెలిపారు. ఏ పాఠశాలలో పనిచేసిన సమయపాలన పాటిస్తూ పిల్లలతో మమేకమై వారికి ప్రేమను పంచుతూ విద్యాబుద్ధులు నేర్పారని ఆయన సేవలను కొనియాడారు. టిపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘంలో క్రియాశీలకంగా పనిచేసి సంఘం బలోపేతం కావడానికి తనవంతు కృషి చేశారన్నారు పదవీ విరమణ ఉద్యోగ ఉపాధ్యాయులకు వరంగా మారాలి కానీ అది శాపం కాకూడదని వారన్నారు మార్చ్ 2024 నుండి పదవి విరమణ పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బకాయిలన్నింటిని తక్షణమే చెల్లించి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో టి పి టి ఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్ రాష్ట్ర కౌన్సిలర్ చుంచు శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు చీకటి ఉపేందర్ మండల విద్యాధికారి ఎస్ వెంకటేశ్వరరావు, కంకర బోర్డ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట్యా నాయక్, బ్రాహ్మణపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధారావత్ బద్రు టిపిటిఎఫ్ నాయకులు రాచకొండ ఉపేందర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఘనపురం బిక్షపతి సారెడ్డి రామలింగారెడ్డి, పి జి హెచ్ ఎం గిరిజ, అనిత, మంజు భార్గవి, గోనే కార్తీక్, జి ఉప్పలయ్య, ఆర్ శ్రీధర్ రెడ్డి, ఏ సురేష్, వివిధ సంఘాల బాధ్యులు కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీమతి ఎస్ .రాగమని పదవి విరమణ కార్యక్రమం...

-ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్...
-నిబద్ధతతో సేవలందించారు : అడిషనల్ డైరెక్టర్...
-హాజరైన సోషల్ వెల్ఫేర్ స్టాప్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ.,వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్...





**మహబూబ్ నగర్, నవంబర్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నాగర్ కర్నూల్ డి ఎస్ సి డి ఓ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీమతి ఎస్. రాగమని పదవీ విరమణ కార్యక్రమం మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని నిర్మల్ కన్వెన్షన్ సెంటర్ లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ మాట్లాడుతూ సూపర్ అంటే శ్రీమతి రాగమని సుదీర్ఘకాలం పనిచేసి ఎలాంటి రిమార్క్ లేకుండా పదవి విరమణ పొందటం అభినందనందయమని అన్నారు. 38 సంవత్సరాల సుదీర్ఘ సర్వీసులో ఉద్యోగి లాగా కాకుండా కుటుంబ సభ్యులుగా గౌరవం పొందటం ఆమె నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా మహిళగా నిబ్బరంగా ఎదుర్కొని సేవలందించడం అభినందనీయమని, గర్వకారణం అని ఏడి కొనియాడారు. ఎస్ సి డి డి స్టాప్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ సూపరింటెండెంట్ రాగమని సర్వీసులో అందించిన సేవలు అమోఘమని, ఈ జనరేషన్ కు ఆదర్శమని అన్నారు. ఘనంగా జరిగిన రాగమని పదవీ విరమణ కార్యక్రమంలో తన సమీప బంధువు వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్, మహబూబ్ నగర్ డిడి సునీత గద్వాల, నాగర్ కర్నూల్ డి ఎస్ సి డి ఓ నుసిత, ఉమాపతి, నాగర్ కర్నూల్ ఈడి రామ్ లాల్, రిటైర్డ్ ఏఎస్డబ్ల్యూఓ కాశన్న, హెచ్ డబ్ల్యు ఓ నరసింహాచారి, చెన్నయ్య, కాజా నిజాముద్దీన్, కొల్లం, జి.శ్రీనివాసులు, బాలకృష్ణ జి, సూపరింటెండెంట్ జి.తిరుపతయ్య గౌడ్, రాష్ట్ర కోశాధికారి కే.జీవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ .చంద్రశేఖర్, కావలి కవిత ముదిరాజ్, సీనియర్ సూపరింటెండెంట్ రాంజీ రావు, జిల్లా టీఎన్జీవో కోశాధికారి కృష్ణమోహన్, విశ్రాంత సూపరింటెండెంట్ లు సత్తెమ్మ, చంద్రశేఖర్, సత్యనారాయణ, పూజరీ నరసింహులు, విష్ణుమూర్తి, కూన స్కైలాబ్, రుష్యేంద్ర ఠాగూర్, తిరుపతయ్య, ప్రవీణ్ కుమార్, రమేష్, కిరణ్ కుమార్, శ్రావణ్ కుమార్, విశ్రాంత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ రాగమని ని అభిమానులు, అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఏఎస్డబ్ల్యువోలు, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు అందరూ బొకేలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# ప్రధాని మోదీ మన్ కి బాత్ వీక్షించిన బోయినపల్లి ప్రవీణ్ రావు

**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రసారమైన మన్ కీ బాత్ 128వ ఎపిసోడ్‌ను కరీంనగర్ పట్టణం విద్యానగర్‌లోని 362 పోలింగ్ బూత్‌లో బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలతో మమేకమయ్యే ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ పరిశోధనా రంగంలో భారతదేశం వేగంగా ముందుకు సాగుతోందని, కష్టతరమైన లక్ష్యాలను కూడా సాధించే సత్తా ఉందని ప్రజలకు తెలియజేశారని అన్నారు.



రాజ్యాంగ దినోత్సవం, 150వ వందేమాతరం ఉత్సవాలు, అలాగే కరీంనగర్ వెండి కళాకృతుల గురించి ప్రధాని మోదీ ప్రస్తావించడం గర్వకారణమని పేర్కొన్నారు. కరీంనగర్‌లో తయారైన సిల్వర్ బుద్ధుడి ప్రతిమను జపాన్ ప్రధానికి, పూల ఆకృతితో ఉన్న సిల్వర్ మిర్రర్‌ను ఇటలీ ప్రధానికి బహుకరించిన విషయాన్ని మోదీ మన్ కీ బాత్లో ప్రస్తావించడం ద్వారా కరీంనగర్ కళాకృతులకు విశ్వ వేదికపై గుర్తింపు లభించిందని ప్రవీణ్ రావు తెలిపారు. కరీంనగర్ ఫిలిగ్రి వర్క్, వెండి కళాకృతులను ప్రస్తావించినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

## వికలాంగులకు ట్రై సైకిళ్లు అందజేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





**మీర్పేట్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** : మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. నంది హిల్స్‌కు చెందిన జూలూరు సైదులు, లెనిన్ నగర్‌కు చెందిన పుల్లయ్య, నేదునూరుకు చెందిన దేవరకొండ అంజయ్యలకు ట్రై సైకిళ్లను మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులకు సహాయం చేయడం బాధ్యత మాత్రమే కాక, సామాజిక బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, అవసరాలను గుర్తించి సేవ చేయడం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్, శీను నాయక్, మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు రజాక్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ, రాళ్లబండి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కరాటే పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**వెల్దండ, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జడ్చర్లలో ఆదివారం జరిగిన 23వ జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్‌లో వెల్దండ మండల మోడల్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుని పతకాలు సాధించారు.పావని, వైష్ణవి, ప్రేమ్ కుమార్, శశాంక్, శేఖర్, త్రిలోచన్, కార్తీక్ వంటి విద్యార్థులు కరాటేలో తమ ప్రతిభను ప్రదర్శించారు. అరవింద్, లక్ష్మణ్, శివ, అభిషేక్, రాము గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించి పాఠశాల గౌరవాన్ని పెంచారు.

## కోట్ర చెక్ పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీలు



**వెల్దండ, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
స్థానిక సంస్థ ఎన్నికల నేపథ్యంలో వెల్దండ మండల పరిధిలోని కోట్ర చెక్ పోస్ట్ వద్ద పోలీసులు కఠిన నిఘా కొనసాగిస్తున్నారు. సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి పర్యవేక్షణలో పోలీసులు అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.ఆదివారం రాత్రి పోలీసులు వాహనాలను ఆపి తనిఖీలు జరిపి, అనుమానాస్పద వస్తువులు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండడం విశేషం.


## ఉచిత మెగా వైద్య శిబిరం

- మందులు పంపిణీ చేసిన సుడా చైర్మన్



**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఖాన్‌పూర్ ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో సితార హాస్పిటల్ సౌజన్యంతో మహమ్మద్ జాఫర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రారంభించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్య పరీక్షల ద్వారా సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మొదటి దశలోనే రోగ నిర్ధారణ జరిగితే మందుల ద్వారా సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ శిబిరంలో 350 మందికి పైగా హాజరై వివిధ పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ జాదవ్ రాజ్ కుమార్, డాక్టర్ వెంకట్ భరద్వాజ్ పర్యవేక్షణలో శిబిరం జరిగింది. కార్యక్రమంలో సమద్ నవాబ్, ముఫ్తీ మహమ్మద్ అలీమొద్దిన్, ఎంఎ కరీం ఖాద్రి, మహమ్మద్ రఫీక్, సయ్యద్ మాజిద్ ఫజల్, ఎంఎ ముజీబ్, జీడి రమేష్, షెహన్నా, శబానా మహమ్మద్, మసూమ్ ఖాన్, బషీర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ ఫిలిగ్రి కళాకృతులు ప్రపంచానికి పరిచయం



**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్ వెండి సాంప్రదాయ కళాకృతులను (ఫిలిగ్రి వర్క్) ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచానికి పరిచయం చేశారని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ప్రసారమైన 128వ మన్ కీ బాత్ కార్యక్రమంలో కరీంనగర్ వెండి కళాకృతుల గురించి ప్రధాని మోదీ ప్రస్తావించడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. జి20 సమావేశాల సందర్భంగా కరీంనగర్‌లో తయారైన సాంప్రదాయ కళాకృతులను విదేశీ ప్రధాన మంత్రులకు బహుకరించిన విషయాన్ని గుర్తు చేశారు. సిల్వర్‌తో తయారైన బుద్ధుడు ప్రతిమను జపాన్ ప్రధానికి, పూల ఆకృతితో ఉన్న సిల్వర్ మిర్రర్‌ను ఇటలీ ప్రధానికి అందజేసిన విషయాన్ని ప్రధాని మోదీ మన్ కీ బాత్లో ప్రస్తావించడం హర్షనీయమని గంగాడి కృష్ణారెడ్డి అన్నారు.


## కొండగట్టు అగ్నిప్రమాద బాధితులకు జాగృతి పరామర్శ



**కరీంనగర్, నవంబర్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్**
: తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన కొండగట్టులో రాత్రిపూట జరిగిన భారీ అగ్నిప్రమాదంలో అనేక కుటుంబాలు తీవ్ర ఆస్తి నష్టాన్ని ఎదుర్కొన్నాయి. షాపులు దగ్ధం కావడంతో దాదాపు 35 కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. సమాచారం అందిన వెంటనే అధికారులు స్పందించి ఉంటే ఇంత పెద్ద నష్టం జరగకపోయేదని ఆయన అన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా భక్తులు కొండగట్టు దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా ఉండటంతో, షాపు యజమానులు లక్షల రూపాయల విలువైన సామాగ్రి నిల్వ చేసుకున్నారని, ప్రమాదంలో అది మొత్తం దగ్ధమైపోయిందని వివరించారు. ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, ప్రతి కుటుంబానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జాగృతి మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివరాణి, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, యువజన నాయకులు హుస్నాబాద్ రాజ్‌కుమార్, మహిళా నాయకురాలు జంగ అపర్ణ, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రలోభాలకు లొంగకుండా
# ప్రజాభివృద్ధికే ఓటు








స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చాయంటే ఊళ్లలో రాజకీయ హంగామా మొదలవుతుంది. అభ్యర్థుల సందర్శనలు, వాగ్దానాల వెల్లువ, తాత్కాలిక ఉపకారాల జల్లు ఇవన్నీ ఓటును ప్రభావితం చేయడానికి చేసే ప్రయత్నాలే. అయితే ప్రజాస్వామ్య బలం, ప్రజల చేతిలో ఉన్న ఓటు శక్తిఅది కేవలం ఒక్కరోజు ఉపకారం కోసం అమ్మబడే వస్తువు కాదు. అది మన ఊరి భవిష్యత్తుకు ధ్రువీకరణ పత్రం. ప్రజలు ఎవరినైనా ఎన్నుకోవడం అంటే, వారి చేతిలో మన సమస్యలను పరిష్కరించే నిర్వాహకాధికారం పెట్టినట్లే. అందుకే నైతికత, సేవాస్ఫూర్తి, సామాజిక బాధ్యత ఉన్న నాయకులే స్థానిక పాలనలో వుండాలి. పేదరికం, అభివృద్ధి లేమి, ఉద్యోగావకాశాల కొరతువీటన్నిటికీ పరిష్కారం చూపగల దూరదృష్టి నాయకత్వం కావాలి. ఎన్నికలు వచ్చినప్పుడే కనబడే ముఖాలను చూసి నిర్ణయం తీసుకోవడం ప్రమాదం. ఓటు కోసం నోట్లు పంచేవారు, మద్యం అందించే వారు గెలిచిన తర్వాత ప్రజల కష్టాలలో పక్కన ఉండరు. నోట్లకు ఓటును అమ్మేసిన ప్రజాస్వామ్యంఅన్యాయానికి బలపడే వ్యవస్థగా మారిపోతుంది. ఒకసారి ప్రలోభాలకు లొంగితే, ఐదేళ్ల శిక్ష విధించుకున్నట్లే. అభ్యర్థుల గతం, చేసిన అభివృద్ధి పనులు, సమస్యల పట్ల వారి తీరును పరిశీలించి ఓటు వేయాలి. కులం, పార్టీ, డబ్బుఇవి నిర్ణయ కారకాలు కాకూడదు.

అనుభవం ఉన్నవారైనా... కొత్తవారైనా... ముఖ్యమైంది ప్రజలతో మమేకమైన సేవాభావం. నాయకుడు ప్రజల ఇల్లు చేరుకోలేకపోతే, అభివృద్ధి ఇంటి ముంగిటకు రాదు. ఓటు హక్కు న్యాయమైన ప్రయోగం దేశ బలాన్ని నిలబెడుతుంది. నిష్కపటంగా ఓటు వేయడం అంటే స్వీయగౌరవాన్ని కాపాడుకోవడం. మన ఓటు కేవలం ఓ మనిషిని గెలిపించడమే కాదు, మన ఊరి దారిని మార్చే శక్తి. చిన్న నిర్ణయం అనుకున్నా దాని ప్రభావం ఐదేళ్లపాటు మన ప్రతిరోజు జీవన ప్రమాణాలపై ఉంటుంది.

ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో
ప్రలోభాలకు లొంగకుండా,
భయాలకు గాకుండా,
తెలివితో, ధర్మంతో,
మన మనసు కోరే న్యాయ నాయకత్వాన్ని
ఎన్నుకోగలిగితే
అదే నిజమైన ప్రజాస్వామ్యం విజయం.

**మన ఓటు మన హక్కు... అదే మన భవిష్యత్తు!**

**వ్యాసకర్త**
నిదిగొండ శ్రీరామ్
సీనియర్ జర్నలిస్ట్
అధ్యక్షులు
తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్

